


హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.170	260	290
సూర్యాపేట	రూ.174	260	290
నల్లగొండ	రూ.165	245	270

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.0 । కనిష్ఠం 25.0

రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం

కొనుగోలు చేయాలి: కలెక్టర్



దేవరకొండలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, పక్కన ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, కొండమల్లేపల్లి, డిండి, మే 13 (ఆంధ్రజ్యోతి):రైతులను ఇబ్బంది పెట్టకుండా మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి మిల్లర్లను ఆదేశించారు. దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని రైస్‌మిల్లర్లు, అధికారులతో ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి సమీక్షించారు. లారీల కొరతలేకుండా చూడాల్సిన బాధ్యత మిల్లర్లపై ఉందన్నారు. రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులను ఇబ్బం ది పెట్టకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన వెంటనే ధాన్యం కొనుగో ల చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడు తూ రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ, డీసీఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఎం హరీష్, ఆర్డీవో రమణారెడ్డి, రైస్‌మిల్లర్లు, అధికారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

కొండమల్లేపల్లి, డిండి మండలాలలోని కొనుగోలు కేంద్రాలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలోని రైతులతో మాట్లాడి అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లారీల కొరత కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ఉండిపోతున్నాయని తెలిపారు. స్పందించిన కలెక్టర్ లారీల యాజమాన్యంతో మాట్లాడి ధాన్యం వేగంగా తీసుకెళ్లి అన్‌లోడ్ చేయించాలని మిల్లు యజమానులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రానికి వచ్చిన ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామన్నారు. డిండి మండలంలోని చెర్కుపల్లి, కామేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆయనవెంట అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హరీష్ పాల్గొన్నారు.

ట్రక్ చీట్



యాసంగి ధాన్యం విక్రయాల్లో రైతులకు అవస్థలు తప్పడం లేదు. నాణ్యత, తేమశాతం, తా లు తదితరాల పేరుతో మిల్లుల వద్ద ధాన్యం తూకంలో కోత విధిస్తున్నా కిమ్మనకుండా అంగీకరించాల్సిన దుస్థితి కొనసాగుతోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద తూకం వేసిన వెంటనే ట్రక్‌షీట్లు రాసి, ట్యాబ్‌లలో ఎంట్రీ చేయాల్సి ఉండగా, మిల్లుల వద్ద దిగుమతి అయ్యా క వచ్చే తూకం మేరకే ట్రక్‌షీట్ రాసి ట్యాబ్‌లలో ఎంట్రీ చేస్తున్నారు. దీంతో రైతులకు క్వింటాకు మూడు శాతం మేర తగ్గించి బిల్లులిస్తున్నారు.

– (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- కేంద్రాల వద్ద తూకానికి, ట్రక్‌షీట్లలో తూకానికి మధ్యతేడాలు
- మిల్లుల తూకం మేరకే ట్రక్‌షీట్లు
- మిల్లుల వద్ద తూకం నిర్ణయించాకే ట్రక్‌షీట్‌లు రాస్తున్న వైనం
- మూడు శాతం వరకు తూకంలో కోత విధిస్తున్నారనే ఆరోపణలు

జిల్లావ్యాప్తంగా కోతలు విధిస్తూ బిల్లులు చెల్లిస్తున్నారు. మిల్లర్లను గట్టిగా నిలదీస్తే ధాన్యం దింపుకోబోమని వెనక్కి పంపిస్తుండడంతో చేసేదేమీ లేక రైతులు, కేంద్రాల నిర్వాహకులు మిల్లర్లు ఇచ్చిన తూకం మేరకు ట్రక్‌షీట్ రాసి బిల్లులు జనరేట్ చేస్తున్నారు. ఇందువల్లే కేంద్రాల వద్ద కాంటాలైన ధాన్యానికి, ట్రక్‌షీట్ జనరేట్ అయిన ధాన్యానికి మధ్య దాదాపు 93వేలమెట్రిక్ టన్నుల ధాన్యం తేడా కనిపిస్తోంది.

మిల్లర్లు ఇచ్చిన తూకాల మేరకే ట్రక్‌షీట్ నమోదు

కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కాంటాలు వేసిన వెంటనే ట్రక్‌షీట్ జనరేట్ చేయాల్సి ఉండగా, జిల్లాలో సగానికిపైగా కేంద్రాల్లో అందుకు విరుద్ధంగా మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి అయ్యాక మిల్లర్లు నిర్దేశించిన తూకం మేరకే ట్రక్‌షీట్ నమోదు చేస్తున్నారు. కేంద్రాల వద్ద ధాన్యం రైతులవారీగా, లాట్లవారీగా తూకం వేసి నామినల్‌గా తెల్లకాగితాలపై నమోదు చేసి మిల్లుల వద్దకు పంపిస్తున్నారు. మిల్లుల వద్ద ధాన్యాన్ని పరిశీలించి తేమ, తాలు, నాణ్యత తదితర కారణాలు చూపుతూ మిల్లర్లు 2 నుంచి 3శాతం వరకు తూకం తగ్గిస్తేనే ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటున్నారు. రైతులు అందుకు అంగీకరించకపోతే ధాన్యాన్ని దించుకునేది లేదని తేల్చిచెబుతుండడంతో అప్పటికే విసిగివేసారిన రైతులు కోతకు అంగీకరించి ధాన్యం దించి, బిల్లులు రాయించుకొని వస్తున్నారు. ఈవిషయమై మిల్లర్లను అధికారులు నిలదీసినా, లేక దించుకోవాల్సిందేనని హెచ్చరించినా తమ గోదాముల్లో ఖాళీలేదని, ధాన్యం దించుకోలేమని చెబుతుండడంతో అధికారులు సైతం గట్టిగా ఆదేశించలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల నల్లగొండ జిల్లాలోని మిల్లుల వద్ద ధాన్యం దించుకోకుండా ఉంటే రైతులు ఆందోళన చేసిన సందర్భంలో ఈవిషయం తేటతెల్లమయింది. జిల్లాలో కేంద్రాల వద్ద కొనుగోలుచేసిన ధాన్యానికి ట్రక్‌షీట్ రాసిన ధాన్యానికి మధ్య దాదాపు 93వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం తేడా ఉండడం కోతల పరిస్థితిని తెలియజేస్తోంది. ధాన్యం విక్రయాలకు ప్రభుత్వం పూర్తిగా మిల్లర్లపై ఆధారపడడంతోనే ఈ దుస్థితి నెలకొందని, ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నప్పటికీ, ఆ ధాన్యాన్ని యథావిధిగా మిల్లులకు తరలించాల్సి రావడంతో మిల్లర్లు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నా, వారిని అదుపు చేయలేని పరిస్థితి నెలకొందని, ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాములకు తరలిస్తే తమకు ఈ దోపిడి భారం తగ్గేదని రైతులు వాపోతున్నారు. సీజన్ ఆరంభంలో మిల్లులపై ఆధారపడకుండా ప్రభుత్వమే ధాన్యాన్ని గోదాముల్లో నిల్వచేస్తారని ప్రకటించినప్పటికీ ఆచరణలో మాత్రం మిల్లులకే ధాన్యం కేటాయించడంతో మిల్లర్లు ఆడిందే ఆటగా సాగుతోంది. జిల్లాలో ఇప్పటివరకు 4,88,494 మెట్రిక్‌టన్నుల ధాన్యం కాంటాలు వేయగా, ఇందులో 3,95,479 మెట్రిక్ టన్నుల ధాన్యం వివరాలనే ట్యాబ్‌లలో ఎంట్రీ చేశారు. ఇందులో 3,48,521 మెట్రిక్‌టన్నుల ధాన్యానికి సంబంధించి మాత్రమే ట్రక్‌షీట్లు జనరేట్ చేశారు. కాంటాలైన ధాన్యంతో పోల్చితే ట్యాబ్‌లో ఎంట్రీ అయిన ధాన్యానికి 93,015 మెట్రిక్ టన్నుల తేడా ఉంటే, ట్రక్‌షీట్ జనరేట్ అయిన ధాన్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే 1,39,973 మెట్రిక్ టన్నుల ధాన్యం తేడా ఉంది. ఈ తేడా ధాన్యానికి సంబంధించిన ట్రక్‌షీట్స్ మిల్లుల వద్ద పెండింగ్ ఉండడమే ఇందుకు కారణంగా స్పష్టమవుతోంది. ధాన్యానికి 2 లేక 3శాతం కటింగ్‌కు రైతులు అంగీకరించిన...

– మిగతా 8వ పేజీలో...

అనధికార డీలర్ల వద్ద విత్తనాలు కొనవద్దు

కలెక్టర్ ఇలాత్రిపాఠి



నల్లగొండలో విత్తన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): రైతులు అనధికార డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ వద్ద తెలంగాణ విత్తన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విత్తన కేంద్రాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగులో రైతులు ఇబ్బందులు పడకుండా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం విత్తన కేంద్రాలను ఏర్పాటు చేసి రాయితీపై రైతులకు విత్తనాలను అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. తక్కువ ధరకు ఆశపడి అనధికారిక డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ నేపథ్యంలో రానున్న వ్యవసాయ సీజన్‌లో సన్నబియ్యం విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తెలంగాణ విత్తన సంస్థ జారీ చేసిన విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని, ప్రత్యేకించి పత్తికి సంబంధించి అనుమతులు లేని లూజు విత్తనాలు కొనుగోలు చేయవద్దని కోరారు. ప్రభుత్వం రాయితీపై పత్తి విత్తనాల పాకెట్లు రూ. 901కి విక్రయిస్తుందని, ఎవరైనా ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పత్తి విత్తనాలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉన్నట్లయితే 8977751452 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని, పాకెట్‌పై తయారు చేసిన తేదీని జాగ్రత్తగా గమనించాలని, రశీదు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమేష్, డీసీసీబీ డైరెక్టర్ సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

భవిత వనరుల కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

గుర్రంపోడు: మండలకేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన భవిత వనరుల కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రం ఎదుట ఉన్న శిథిలమైన ఏఎమ్మార్పీ క్వార్టర్లను, చుట్టూ ఉన్న కంపచెట్లను తొలగించాలని సూచించారు. మరుగుదొడ్లను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భవిత కేంద్రానికి అన్ని సౌకర్యాలు కల్పించి సక్రమంగా నడిపించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎమ్మార్సీలో నడుస్తున్న భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ పరికరాలను పరిశీలించి వినియోగాన్ని కేంద్ర నిర్వాహకురాలు ఐఈ ఆర్పీ శారదను అడిగి తెలుసుకున్నారు.

విత్తన పంపిణీకి సమాయత్తం

- ఉమ్మడి జిల్లాలో 104 కేంద్రాల ద్వారా పంపిణీ



7

వనమహోత్సవానికి మొక్కలు సిద్ధం చేయాలి

- డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి



దామెర నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో పీడీ శేఖర్ రెడ్డి

నాంపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): జూన్ నెలలో నిర్వహించే వనమహోత్సవానికి మొక్కలను సిద్ధం చేయాలని డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. నాంపల్లి మండలంలోని దామెర గ్రామపంచాయతీలో మంగళవారం ఆయన నర్సరీలో ఉన్న మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. కూలీలకు రూ. 307 వేతనం వచ్చే విధంగా పనిచేయించాలని, పని ప్రదేశంలో మంచినీరు, నీడ సౌకర్యం కల్పించాలని అన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కూలీల సంఖ్య పెంచి పనులు కల్పించాలని అన్నారు. ఉపాధి హామీ పథకంలో నీటినిల్వ పనులు, రైతుల వ్యక్తిగత భూములలో పండ్ల తోటల పెంపకం పనులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అనంతరం పెద్దాపురం గ్రామపంచాయతీలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు కాంటా వేస్తున్నారా? లారీల సమస్య హమాలి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. ఇంకా ఎంత ధాన్యం నిల్వ ఉంది, ఎన్ని రోజుల్లో కొనుగోళ్లు పూర్తవుతాయని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో దేవరకొండ ఏపీడీ యామిని, ఎంపీడీవో రామకృష్ణశర్మ, ఏపీవో గుంటుక వెంకటేశం, ఏపీఎం వినోద్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, కోఆర్డినేటరు, పాల్గొన్నారు.

ఎస్‌ఐలకు స్థానచలనం

నల్లగొండ టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరు పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న ఐదుగురు ఎస్‌ఐలకు స్థానచలనం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బదిలీ అయిన ఎస్‌ఐల వివరాలు..

ఎస్‌ఐ పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న ప్రదేశం	బదిలీ అయిన స్థానం
అజ్మీరారమేష్	నల్లగొండ ట్రాఫిక్ (దేవరకొండ పీఎస్ అటాచ్)	ఎస్‌హెచ్‌వో, కొండమల్లేపల్లి
ఎం. రామ్మూర్తి	ఎస్‌హెచ్‌వో, కొండమల్లేపల్లి	ఎస్‌హెచ్‌వో, చింతపల్లి
బి. యాదయ్య	ఎస్‌హెచ్‌వో, చింతపల్లి	ఐజీ కార్యాలయ
పి. లోకేష్	సీసీఎస్, నల్లగొండ	ఎస్‌హెచ్‌వో, చందంపేట
యు. సతీష్	ఎస్‌హెచ్‌వో, చందంపేట	ఐజీ కార్యాలయం

పెట్టుబడిదారుల కొమ్ముకాస్తున్న కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు వెంకట్‌రెడ్డి

నాంపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తుందని, కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తుందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో నిర్వహించిన సీపీఐ మహాసభకు ఆయన పార్టీ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సామాన్య, పేద ప్రజలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దోపిడీ రహిత సమాజం కోసం పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం బాధాకరమన్నారు. ఉగ్రవాదాన్ని అంతమొందించడానికి కుల, మతం, పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త సీపీఐ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించి ప్రజలకు సేవ చేయడానికి ముందు వరుసలో ఉండాలని సూచించారు. ఈ మహాసభలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాగిఫణి అంజాచారి, మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బుడిగపాక జగన్, నాయకులు ఊరుపక్క వెంకటయ్య, నేతల రాజు, పల్లె సైదయ్య, దండిగ వెంకటయ్య, కోరే సత్తయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా పాలీసెట్



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

నల్లగొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి తెలంగాణ సాంకేతిక విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించిన టీజీ పాలీసెట్ - 2025 ప్రవేశ పరీక్ష మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 25 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. నల్లగొండ జిల్లాలో జరిగిన పరీక్షలను జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. నర్సింహారావు, సూర్యాపేట జిల్లాలో జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సుజాత, యాదాద్రిభువనగిరి జిల్లాలో జరిగిన పరీక్షలను జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. నల్లగొండ జిల్లాలో ఏర్పాటు చేసిన 11 పరీక్ష కేంద్రాలకు 5203 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 4,750మంది హాజరయ్యారు. 480 మంది గైర్హాజరయ్యారు. వీరిలో 2501 మంది బాలికలకు 2278 మంది హాజరుకాగా, 2,702 మంది బాలురకు 2,472 మంది హాజరయ్యారు. సూర్యాపేట జిల్లాలో ఏర్పాటు చేసిన 7 పరీక్ష కేంద్రాలలో 2,798 మంది విద్యార్థులకు 2,590 మంది విద్యార్థులు హాజరు కాగా 208 మంది గైర్హాజరయ్యారు. వీరిలో 1362 మంది బాలికలకు 1260 మంది హాజరు కాగా, 1436 మంది బాలురకు 1330 మంది హాజరయ్యారు. యాదాద్రి జిల్లాలోని యాదగిరిగుట్టలో రెండు, భువనగిరిలో 4 కేంద్రాలలో 1754 మంది విద్యార్థులకు 1664 మంది విద్యార్థులు హాజరుకాగా 90 మంది గైర్హాజరయ్యారు. వీరిలో 844 మంది బాలికలకు 794 మంది హాజరు కాగా 910 బాలురకు 870 మంది హాజరయ్యారు.

సాగర్ నీటి మట్టం 512 అడుగులు



నాగార్జునసాగర్‌లో తగ్గిన నీటి మట్టం

7

వేసవిలోనూ నిండు కుండలా మూసీ

- పెరుగుతున్న నీటి మట్టం



భూదాన్‌పోచంపల్లికి విశ్వఖ్యాతి!

'భూదాన్‌పోచంపల్లి అనగానే మగువలు మెచ్చే పట్టుచీరలకు నిలయం. సిల్క్‌సిటీ ఆఫ్ పోచంపల్లిగా ప్రసిద్ధి. దేశంలోనే మొదటిసారిగా భూదానం జరగడంతో భూదాన్ గంగోత్రిగానూ ప్రపంచ ప్రసిద్ధి. ఈ అంశాలే పోచంపల్లిని ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చి ఐక్యరాజ్యసమితి అనుబంధంగా పనిచేస్తున్న ప్రపంచ పర్యాటక సంస్థ(యూఎన్‌డబ్ల్యుటీవో) నిర్వహించిన 'బెస్ట్ టూరిజం విలేజ్' పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచి విశ్వఖ్యాతి పొందింది. అదే కోవలో ప్రపంచ సుందరీమణుల రాకతో మరోసారి విశ్వవ్యాప్త దృష్టిని ఆకర్షిస్తోంది."

– (ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

భూదానోద్యమ స్ఫూర్తి, ఇక్కత్ పట్టు చీరల తయారీకి ప్రసిద్ధి చెంది, దేశ, విదేశీయుల మనసు దోచిన పల్లె భూదాన్‌పోచంపల్లి. పేదలకు భూమిని పంచిన ఆచార్య వినోబాభావే నడయాడిన నేల ఇది. గ్రామీణ జీవనశైలి, సంస్కృతీ సంప్రదాయాలకు నిలయం ఈ గ్రామం. పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటూ ఆహ్లాదపరుస్తోంది. ప్రపంచ ఉత్తమ పర్యాటక గ్రామంగా గుర్తింపు పొందింది. రాష్ట్ర రాజధానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉండే భూదాన్ పోచంపల్లిని సందర్శించేందుకు ఈ నెల 15న ప్రపంచ సుందీరమణులు రానున్నారు.

ఘనమైన చరిత్ర

ఊరంటే చెట్టు, చేమ, మళ్లు, చెరువులు, చెలకలు, పాడి పశువులు, గుడి, బడి ఇలా వాటితో పెనవేసుకున్న మనుషులు. వీటన్నింటితో పాటు పోచంపల్లికి అత్యంత గుర్తింపు తెచ్చిన మరొకటి చేనేత. పడుగు, పేకలతో చేనేత టై అండ్ డై ఇక్కత్ పట్టు వస్త్రాల తయారీకి పుట్టిల్లు ఈ గ్రామం. దీంతో సిల్క్ సిటీ ఆఫ్ ఇండియాగా పేరొందింది. చేనేత వస్త్రాలకు ఆలవాలం కాకముందు గాజులు, పూసల తయారీకి ప్రసిద్ధి చెందినదిగా చెబుతుంటారు. అందుకే దీనికి 'గాజుల పూసలపల్లి'గా పేరు. ఉచ్ఛరణలో రానురాను గాజులపోచంపల్లిగా అయ్యింది. భూదానోద్యమం మహోద్యమానికి అంకురార్పణ జరిగిన క్రమంలో భూదాన్‌పోచంపల్లిగా పేరొందింది.





వినోబాభావే స్ఫూర్తితో భూదానోద్యమం

మహాత్మాగాంధీ ప్రియశిష్యుడైన ఆచార్య వినోబాభావే 1951 ఏప్రిల్ 15న హైదరాబాద్‌లోని శివరాంపల్లిలో నిర్వహించే సర్వోదయ సమ్మేళనానికి హాజరయ్యారు. ఆ సమయంలో నల్లగొండ జిల్లాలో జరుగుతున్న కల్లోల పరిస్థితులను తెలుసుకొని పరిష్కారమార్గాన్ని వెతకడానికి పాదయాత్రగా పోచంపల్లికి చేరుకున్నారు. ఏప్రిల్ 18న దళితులతో సమావేశమయ్యారు. తమకు కొంత భూమిని ఇప్పిస్తే సాగుచేసుకుని జీవిస్తామని గోడును వెల్లబోసుకున్నారు. దీంతో వినోబాభావే స్పందిస్తూ మీలో ఎవరైనా భూమి దానం చేసేవారున్నారా? అని అడగడంతో అక్కడే ఉన్న వెదిరె రామచంద్రారెడ్డి లేచి తన తండ్రి జ్ఞాపకార్థం 100 ఎకరాల భూమి దానం చేస్తానని ప్రకటించారు. అక్కడికక్కడే దానపత్రం నిండు సభలో వినోబాభావేకు అందజేశారు. దానరూపేణ ఇచ్చిన భూమిని వెంటనే పేదలకు పంచి భూదానోద్యమానికి బీజం వేశారు. వినోబాజీ పాదయాత్ర కాస్త 'భూదానయాత్ర'గా మారింది. దేశవ్యాప్తంగా 44లక్షల ఎకరాల భూమిని సేకరించి పేదలకు పంచారు.

అరబ్ దేశాలకు రుమాళ్లు

అసఫ్‌జాహీల పాలన కాలం నాటికే చేనేత మగ్గాల సవ్వడిని వింటూ ఉంది పోచంపల్లి. అద్భుతమైన వస్త్రనేత కళాకారులకు పెద్దపీట వేసింది. 1910 నాటికే ఇక్కడ చిటికి పరిశ్రమ ఏర్పాటైంది. ఇరవై నెంబరు నూలుతో 'తేలియా రుమాళ్లు' నేసేవారు. వ్యాపార నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిపోయే అరబ్బులు వీటిని ఇష్టపడి కొనుగోలు చేసేవారు. ఆ తరువాత తేలియా రుమాళ్లను అరబ్ దేశాలకు ఎగుమతి చేయడం ఆరంభించారు.

పట్టుకు పెట్టింది పేరు

తేలియా రుమాళ్ల తర్వాత కాటన్ వస్త్రాల తయారీ ఇక్కడ సాగింది. ఈ గ్రామానికి కర్నాటి అనంతరాములు, తడక పెద్ద యాదగిరి అనే చేనేత కళాకారులు 60 నెంబరు నూలుతో పడుగు, పేకలతో సహజ రంగుల్లో చీరలను నేశారు. 1956లో పోచంపల్లిని సందర్శించిన ఆలిండియా హ్యాండ్లూమ్ బోర్డు ప్రెసిడెంట్ కమలాబాయి ఛటోపాధ్యాయ చిన్న తరహాపరిశ్రమ డైరెక్టర్ దయారాం కాటన్ మాదిరిగానే పట్టుచీరలను తయారుచేయమని వారిని కోరారు. వారి కోరిక మేరకు అనంత రాములు, పెద్ద యాదగిరి ఇద్దరూ బనారస్ వెళ్లి అక్కడ ఏడాదిపాటు శిక్షణ తీసుకున్నారు. అనంతరం కర్నాటి అనంతరాములుతో పాటు భిక్షపతి, కర్నాటి వాసుదేవ్ తమిళనాడు రాష్ట్రంలోని కుంభకోణం వెళ్లి రంగుల అద్దకంలో శిక్షణ పొందారు. ఆ తర్వాత పోచంపల్లికి వచ్చి మొట్టమొదటిసారిగా 1958లో కర్నాటి అనంతరాములు మగ్గంపై పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ చీరను నేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో నిలదొక్కుకోవాలంటే చేనేత సంప్రదాయక వృత్తి నైపుణ్యాలను చట్టబద్ధమైన హక్కులు కల్పించాల్సిన అవసరాన్ని డబ్ల్యుటీవో గుర్తించింది. 1999లో జియోగ్రాఫికల్ ఇంటికేషన్ ఆఫ్ గూడ్స్ చట్టం చేశారు. దీని ద్వారా ఒక ప్రాంతంలో తయారైన వస్తువులకు రక్షణ కల్పించవచ్చు. ట్రాప్స్‌లోని ఆర్టికల్ 22 నుంచి 24 వరకు వస్త్ర పరిశ్రమలకు సంబంధించిన అంశాలుంటాయి. వాటి ఆధారంతో వస్త్రాల తయారీకి విశిష్టతను గుర్తించిన ప్రభుత్వం 2003లో పేటెంట్ హక్కును (జియోగ్రాఫికల్ ఇండికేషన్ యాక్ట్-జీఐఏ) కల్పించింది. దీంతో చేనేత ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి కావడంతో చేనేత కార్మికుల ప్రతిభకు విశ్వవ్యాప్త గుర్తింపు లభించింది.

చేనేత వస్త్రాలకు పుట్టినిల్లు ▸▸

భూదాన ఉద్యమానికి నాంది పలికిన నేల ▸▸

ప్రపంచ పర్యాటక గ్రామంగా గుర్తింపు ▸▸

సినిమా షూటింగ్, షార్ట్ ఫిల్మ్స్‌కు కేరాఫ్

ఎటుచూసినా పచ్చని పంట పొలాలు. మూసీ పరివాహకంలోని వరి చేలు, చెరువులు, గుట్టలతో అందమైన లొకేషన్లు, ఆహ్లాదకరమైన వాతావరణంలో కోనసీమను తలపించే ఈ ప్రాంతంలో సినిమా షూటింగ్‌లకు, షార్ట్ ఫిలింలకు కేరాఫ్ అడ్రస్‌గా పోచంపల్లి మారింది. షూటింగ్‌లకు మొదట క్లాప్ కొట్టి యాక్షన్ చెప్పింది ప్రముఖ దర్శకుడు శ్యామ్ బెనగల్. 1986లో సుస్మాన్ సినిమా షూటింగ్ కోసం పోచంపల్లికి ఆయన హీరోయిన్ షబనా ఆజ్మీతో సహా ఆ సినిమా యూనిట్ మొత్తం పోచంపల్లిలోనే నెలరోజుకుపైగా బసచేశారు. ప్రముఖ నటుడు ఓంపురి కూడా ఇక్కడికి వచ్చి చేనేత పని నేర్చుకున్నారు. అలా సుస్మాన్‌తో మొదలై నేటి వరకు ఎన్నో తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల సినిమాలు, పలు సీరియల్స్, డాక్యుమెంటరీల షూటింగ్‌లు నేటికీ నిత్యం జరుగుతున్నాయి.

ప్రపంచ సుందరీమణుల సందర్శనతో 'పోచంపల్లి ఇక్కత్'కు మరింత ప్రాచుర్యం



పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాలకు ఇప్పటికే ఖండాంతర ఖ్యాతి ఉంది. కాగా, ఈనెల 15న పోచంపల్లికి ప్రపంచ సుందరీమణులు సందర్శించి చేనేత థీమ్‌పై విస్తృత ప్రచారం చేయనున్నారు. దీంతో దేశ విదేశాల్లో పోచంపల్లి ఇక్కత్‌కు బ్రాండ్ ఇమేజ్ మరింత పెరగనున్నది.

– తడక రమేష్, పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ ట్రస్ట్ చైర్మన్ తడక రమేష్

సుందరీమణుల రాకతో మరింత ప్రాచుర్యం



భూదాన్‌పోచంపల్లికి ఈనెల 15న ప్రపంచ సుందరీమణులు వస్తున్న నేపథ్యంలో పోచంపల్లి ఖ్యాతి ప్రపంచదేశాలకు ప్రాచుర్యం పొందనున్నది. ఇక్కడిఇక్కత్ పట్టు చీరలకు మంచి గుర్తింపు లభించనుంది. ఇప్పటికే చేనేత పరిశ్రమతో పాటు భూదానోద్యమానికి నాంది పిలికి పేరొందిన పోచంపల్లి ప్రపంచ సుందరీమణుల సందర్శనతో మరింత పేరు లభించనుంది.

– మెరుగు శశికళ, జిల్లా చేనేత నాయకురాలు

పర్యాటకానికి రంగులు అద్దిన ఊరు

వినోబాభావే సందర్శనతో భూదానోద్యమానికి నాంది పలికింది పోచంపల్లి. దీంతో ఈ ఊరికి చారిత్రక ప్రాశస్త్యాన్ని కల్పించింది. చేనేత, భూదానోద్యమం ద్వారా పోచంపల్లి ఓ పర్యాటక పల్లెగా మారింది. చేనేత మార్కెటింగ్ కోసం వచ్చిపోయే వ్యాపారులు, కొనుగోలుదారులతో పాటు ఆచార్య వినోబాభావే నడయాడిన నేల, ఆయన కూర్చున్న జువ్విచెట్టు, ఆయన బసచేసిన చోటు వినోబా మందిరంగా నిలిచింది. పూర్వం దొరల కాలంలో సంతాన ప్రాప్తి కోసం ఇక్కడ నిర్మించిన 101 దర్వాజల భవనాన్ని సందర్శించేందుకు ఎంతోమంది పర్యాటకులు వస్తుంటారు. 2007లో రూ.3.75 కోట్లతో ఇక్కడ గ్రామీణ పర్యాటక కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. రూరల్ టూరిజం సెంటర్ నేడు విదేశీయులకు అధ్యయన కేంద్రంగా మారింది. గతంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని పోచంపల్లి టూరిజం పార్క్‌లో మేళాలను నిర్వహించారు. ఇందులో చేనేత వస్త్రాల ప్రదర్శన, హ్యాండీక్రాఫ్ట్స్, గ్రామీణ వంటకాల రుచులు, గ్రామీణ కళల్లో భాగంగా గంగిరెద్దుల ఆట, డప్పు కళాకారుల ఆటపాట, ఒగ్గు కళారూపాలను ప్రదర్శిచి అలరించారు. భూదాన్‌పోచంపల్లిలోని చేనేత పట్టు చీరలకు ప్రాచుర్యం కల్పించేందుకు



పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు స్థానిక టూరిజం పార్క్‌లో 2008లో ఫ్యాషన్ షోను ప్రదర్శించారు. ప్రముఖ నటి శోభనతో పాటు పలువురు మోడల్స్ పోచంల్లి ఇక్కత్ వస్త్రాలతో ఫ్యాషన్ షో నిర్వహించి పర్యాటకులను ఆకట్టుకున్నారు.

విషజ్వరంతో విద్యార్థిని మృతి



సహస్ర కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి, సహస్ర(ఫైల్‌ఫొటో)

యాదగిరిగుట్ట రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామంలో విద్యార్థిని మృతితో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సౌన్నాయిల రమేష్ కుమార్తె సహస్ర(13) ఈ నెల 11న విపరీతమైన జ్వరానికి గురైంది. దీంతో హైదరాబాద్ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించారు. రెండు రోజులు చికిత్సపొందుతూ ఈ నెల 12న మృతి చెందింది. ఇప్పటివరకు సహస్రకు ఎలాంటి జబ్బులు లేకపోవడంతో గ్రామస్థులు ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్థుల్లో కొందరు విషజ్వరంతో బాధపడుతున్న వారు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. అయితే విషజ్వరాలతో గ్రామస్థులు బాధపడుతున్నా వైద్యులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామంలో మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


సహస్ర కుటుంబాన్ని పరామర్శించిన మహేందర్‌రెడ్డి

పెద్దకందుకూర్‌లో సహస్ర మృతదేహంపై డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. మృతికి గల కారణాలను అగిడి తెలుసుకున్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఇంటింటి సర్వే చేయిస్తున్నాం : మెడికల్ ఆఫీసర్ పావని

పెద్దకందుకూర్ గ్రామంలో సిబ్బందితో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని మెడికల్‌ఆఫీసర్ పావని తెలిపారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆరోగ్య విషయంలో ఎప్పటికప్పుడు వారికి సలహాలు సూచనలు చేస్తున్నామన్నారు. మృతి చెందిన విద్యార్థి సహస్ర పీహెచ్‌సీకి రాలేదని, గ్రామంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

బత్తాయి చెట్లు దగ్ధం



చెట్లు కాలిపోయిన ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రావు

పెద్దఅడిశర్లపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం దుగ్యాల గ్రామ శివారులో మంగళవారం బత్తాయి తోట దగ్ధమైంది. బాధిత రైతుల వివరాల ప్రకారం పీఏపల్లి గ్రామానికి చెందిన నారాయణ శ్రీనివాస్ 30 చెట్లు, ఏరుకొండ లింగయ్యకు చెందిన 30, గణపురం సంతోష్‌కు చెందిన 5 చెట్లు సమీపంలోని రైతులు వరి కొయ్యలు కాల్చడంతో ఎండకు పక్కనే ఉన్న బత్తాయి చెట్లకు అంటుకున్నాయి. దీంతో చెట్లు దగ్ధమైనట్లు వారు తెలిపారు. మిగతా చెట్లకు వ్యాపించకుండా అప్రమత్తమైన రైతులు వెంటనే మంటలు ఆర్పివేశారు. సంఘటనా స్థలాన్ని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు ఘటన స్థలాన్ని సందర్శించి, పంచనామా నిర్వహించారు. ఎనిమిదేళ్లుగా చెట్లను కాపాడుకుంటూ వస్తున్నామని, చెట్లు కాలిపోవడంతో నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వీధికుక్కల దాడిలో లేగ దూడ మృతి

ఆలేరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : వీధికుక్కల దాడిలో లేగదూడె మృతి చెందింది. ఈ సంఘటన మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులో సోమరాజు బావిగూడెం వద్ద జరిగింది. స్థానిక రైతు గంగధారి అంజయ్య తన వ్యవసాయ బావి వద్ద పశువుల కొట్టంలో పాడి ఆవులు, గేదెలు, లేగ దూడెలను సోమవారం రాత్రి కట్టేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం కొన్ని వీధికుక్కలు లేగ దూడపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో లేగ దూడ అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామంలో అధికంగా ఉన్న వీధికుక్కలను తక్షణమే నివారించే చర్యలు చేపట్టాలని రైతులు అధికారులను కోరారు.

ఒక్కో కేసుకు ఖరీదు

● పోలీసుల డిమాండ్లతో భయం

● సూర్యాపేట ఘటనతో సర్వత్రా చర్చనీయాంశం

మోత్కూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : నిజాయితీకి మారుపేరుగా ఉండాల్సిన పోలీసు శాఖలో కొందరు అవినీతి మరకలంటించుకుంటున్నారు. అక్రమార్కులతో పోలీసులే లాలూచి పడి అక్రమార్జనకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నేరారోపణ ఎదుర్కొంటున్న వారు సైతం పోలీసుల అత్యాశకు బెదిరి ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. ఏసీబీ చిక్కుతున్నా వారి తీరులో మార్పు రావడం లేదు. తాజాగా సూర్యాపేట జిల్లాకేంద్రంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాహకుల నుంచి రూ.16 లక్షలు డిమాండ్ చేసిన కేసులో డీఎస్పీ పార్థసారధి, సీఐ వీరరాఘవులు ఏసీబీకి పట్టుబట్టారు. దీంతో పోలీసుల తీరు చర్చనీయాంశమైంది. అక్రమ వసూళ్లలో పోలీసులు తమ తీరును మార్చుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్ నాగరాజు ఈ ఏడాది ఏసీబీకి చిక్కారు. జనవరి 12న తిరుమలగిరి పోలీసులు వాహనాల తనిఖీలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. విచారణలో సిద్ధిపేట జిల్లా రాయికల్ మండలం వడ్డెపల్లి గ్రామానికి చెందిన రైస్‌మిల్ వ్యాపారి చంద్రశేఖర్‌గా పేరు చెప్పారు. తిరుమలగిరి ఎస్ఐ సురేష్ రైస్‌మిల్ వ్యాపారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కేసు నుంచి తప్పించడానికి రూ.3లక్షల లంచం ఇవ్వాలని డిమాండ్ చేసి రూ.లక్షా 40వేలకు డీల్ కుదుర్చుకున్నాడు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించి ఎస్ఐని, కానిస్టేబుల్‌ను పట్టించాడు. దీంతో వారు ఎస్ఐ, కానిస్టేబుల్‌ను కస్టడీలోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ఆలేరు రూరల్: ఆలేరు నియోజకవర్గంలో గుండాల పోలీస్‌స్టేషన్ మినహాయించి మిగతా పోలీస్‌స్టేషన్లలో రెండేళ్లుగా ఏసీబీ దాడులు జరుగలేదు. 2020లో అప్పటి గుండాల ఎస్ఐ చందర్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. రేషన్ బియ్యం కేసులో పట్టుబడిన వ్యాన్‌ను విడిపించేందు కోసం బాధితుడి నుంచి రూ.50వేలు లంచం అడగగా బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ప్రస్తుతం ఆయన వరంగల్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అయితే కొన్ని స్టేషన్లలో మాములు వసూళ్ల చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం కొందరిని నియమించినట్లు సమాచారం.



తిరుమలగిరిలో లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్ నాగరాజు(ఫైల్‌ఫొటో)

● **అక్రమార్కులకు వత్తాసు**

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్లలో ప్రతీ పనికి రేటు నిర్ణయిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొంత మంది ఎస్ఐలు అవినీతి సంపాదనకు అలవాటు పడి అక్రమాలకు తెరలేపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. అక్రమార్జన కోసం రేషన్‌బియ్యం, ఇసుకఅక్రమ రవాణాకు సహకరిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. 2024 అక్టోబరు 23న ఓ కేసులో రూ.10వేలు లంచం తీసుకుంటూ చింతలపాలెం ఎస్ఐ అంతిరెడ్డి ఏసీబీకి పట్టుబడ్డారు.అయినా ఇతరుల్లో మార్పురాలేదు.ఒక్కో కేసుకు రూ.50వేల నుంచి రూ.5లక్షల వరకు ఎస్ఐలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

● హుజూర్‌నగర్ ప్రాంతంలో ఓ కేసులో బాధితురాలిని రాజీకి కుదుర్చిన ఎస్ఐ ఉదంతం బాధిత మహిళ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి కాళ్లపై పడి తెలపడంతో అంతా నివ్వెరపోయారు. రియల్ ఎస్టేట్ ఏజెంట్‌ను మరికొంతమంది అదేరంగంలోని వారు నమ్మించి మోసగించడంతో ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ కేసులో పోలీసులకు రూ.10 లక్షల వరకు ముట్టినట్లు ఆరోపణలు వచ్చాయి.నిందితులపై కేసులు పెట్టకుండా ఫిర్యాదుదారురాలిని మోసం చేసిన అధికారులు చివరికి బాధితురాలికి రూ.6 లక్షలు ఇప్పించి కేసు రాజీ చేసినట్లు సమాచారం. ఒక్కటి కాదు, రెండు కాదు, వందల కేసుల్లో పోలీసులు చేతివాటం ప్రదర్శిస్తూ అక్రమార్కులకు అండగా ఉంటూ తప్పుడు కేసులు బనాయిస్తు న్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పరిచయం పెంచుకుని నకిలీ బంగారంతో మోసం

మేళ్లచెర్వు, మే 13 (ఆంధ్రజ్యోతి) : పరిచయం పెంచుకుని నకిలీ బంగారం విక్రయించిన ఘటన సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలకేంద్రంలో జరిగింది. బాధితులు, ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం నెల రోజుల క్రితం పావురాలు, కౌజుపిట్టలు పట్టే ముగ్గురు మేళ్లచెర్వు మండలకేంద్రానికి చెందిన శంభిరెడ్డికి పరిచమయ్యారు. తాము ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లాకు చెందిన వాళ్లమని పిట్టలు పట్టుకొని జీవనం సాగిస్తామని, తక్కువ ధరకు అందిస్తామని తెలిపి ఫోన్‌నెంబర్ తీసుకొని ఒకటి, రెండుసార్లు కౌజు పిట్టలను అందించి పరిచయం పెంచుకున్నారు. 20 రోజుల క్రితం తమ సమీప బంధువు ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తుండగా అతడికి వ్యవసాయ పొలంలో భారీగా బంగారం దొరికిందని, కావాల్సిన వారికి తక్కువ ధరకు అందిస్తామని పదేపదే శంభిరెడ్డికి ఫోన్ చేశారు. 15 రోజుల కిందట సదరు వ్యక్తుల ఫోన్‌కు స్పందించిన శంభిరెడ్డి అనంతపురం జిల్లా వెళ్లగా ఆయనకు శాంపిల్‌గా కొంత బంగారం ఉచితంగా అందజేశారు. ఆ బంగారాన్ని ఆయన మేళ్లచెర్వుకు తీసుకువచ్చి పరీక్షించగా మేలిమి బంగారం అని తేలిందని చెప్పారన్నారు. గత వారం రోజుల కిందట మరోసారి అనంతపురం జిల్లాకు వెళ్లి రూ.3 లక్షలతో బంగారం కొనుగోలు చేసి, దానిని స్థానికంగా తీసుకువచ్చి పరిశీలించినట్లు శంభిరెడ్డి తెలిపారు. నకిలీ బంగారం అని తేలటంతో తాను మోసపోయానని గ్రహించి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు శంభిరెడ్డి తెలిపారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పరమేష్ తెలిపారు.



శంభిరెడ్డి కొనుగోలు చేసిన నకిలీ బంగారం గొలుసు

తక్కువ ధరకు కొని ఐకేపీ కేంద్రాల్లో విక్రయించి

● ఒకరు సస్పెన్షన్, ముగ్గురు వ్యాపారులపై కేసు నమోదు

రాజాపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ధరకు రైతుల ఉంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వ కొనుగోలు కేంద్రలో దళారులు విక్రయిస్తున్నారనే సమాచారంతో మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని దూది వెంకటాపూర్ కొనుగోలు కేంద్రాన్ని అధికారులు తనిఖీ చేశారు. రెవెన్యూ, వ్యవసాయ, సహకార, పౌరసరఫరాల శాఖ అధికారులు మూకుమ్మడిగా తనిఖీలు నిర్వహించారు. వ్యాపారులు సన్న, చిన్నకారు రైతుల నుంచి ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఐకేపీ కేంద్రానికి తరలించి విక్రయాలు జరుపుతున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో దీనిపై అధికారులు విచారణ నిర్వహించారు. విక్రయిస్తున్నది వాస్తవమేనని రైతులు అధికారులకు వివరించారు. గ్రామానికి చెందిన వ్యాపారులైన నక్కిర్తి కనకరత్నం, నక్కిర్తి లక్ష్మి, వస్పరి మహేశ్‌లపై కేసు నమోదు చేసి 400 క్వింటాళ్ల ధాన్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఏఈవోను సస్పెండ్ చేస్తూ కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జిని విధుల నుంచి తొలగించారు. అక్రమంగా కొనుగోలు కేంద్రాల్లో వ్యాపారులు ధాన్యం విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ అనిత, వ్యవసాయాధికారి పద్మజ రైతులకు సూచించారు.



దూదివెంకటాపూర్ కేంద్రంలో వివరాలు సేకరిస్తున్న వివిధ శాఖల అధికారులు

గంజాయి స్వాధీనం

భువనగిరి టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో మంగళవారం గంజాయి విక్రయిస్తున్న స్థానికుడైన ఎండీ ఇమ్రాన్ ఖాన్‌ను అరెస్ట్ చేసినట్లు పట్టణ ఎస్ఐ కుమారస్వామి తెలిపారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి తెచ్చిన గంజాయిని బస్టాండ్‌లో విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో నిందితుడిని పట్టుకొని ఆయన వద్ద నుంచి 0.138 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

ఆవుల పట్టివేత

అక్రమంగా తరలిస్తున్న 16 ఆవులను మంగళవారం స్వాధీనం చేసుకుని హైదరాబాద్ జియాగూడలోని గోశాలకు అప్పగించినట్లు భువనగిరి పట్టణ ఎస్ఐ కుమారస్వామి తెలిపారు. వరంగల్ వైపు నుంచి హైదరాబాద్‌కు ఆవులను తీసుకెళ్తున్న ట్రక్కును తనిఖీ చేయగా ఆవుల అక్రమ రవాణా వెలుగుచూసిందన్నారు. ఈ మేరకు నిందితుడు మరిశెట్టి సత్తయ్యను అరెస్ట్ చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వివాహిత మిస్సింగ్ కేసు

యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండల కేంద్రానికి చెందిన ధీరావత్ బాబ్లి కుటుంబసభ్యులతో కలిసి దంత వైద్యశాలకు వెళ్లేందుకు సోమవారం భువనగిరి బస్టాండ్‌కు వచ్చింది. బస్సు దిగిన అనంతరం కుమారుడితో కలిసి మూత్రవిసర్జనకు వెళ్తున్నానని చెప్పి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బస్టాండ్ పరిసరాలు, తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి

చిలుకూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మూడు పాడిగేదెలు మృతి చెందాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం సీతారాంపురం గ్రామంలో మంగళవారం జరిగింది. బాధిత రైతులు గన్నా వెంకటేశ్వర్లు, గన్నా సత్యనారాయణ, గోపిదేశి ముత్తయ్యలు తెలిపిన వివరాల ప్రకారం రోజు మాదిరిగానే మేత కోసం పశువులను పొలాలకు వదలగా, గ్రామ పరిధిలోని సబ్బుల ఫ్యాక్టరీ గోదాం వెనుక గల పొలాల్లో విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయన్నారు. వీటి విలువ రూ.2 లక్షలకుపైనే ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

తుక్కాపురంలో..

భువనగిరి రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం తుక్కాపురంలో మంగళవారం జరిగింది. రూరల్ సీఐ చంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం రాసాల రమేష్ గేదెలు మేత మేస్తూ హర్షవర్ధన్ పొలంలోకి వెళ్లాయి. హర్షవర్ధన్ తన పొలం చుట్టూ విద్యుత్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నాడు. రమేష్‌పాడి గేదె ఆ ఫెన్సింగ్‌కు ఉన్న తీగలకు తగిలి మృతి చెందింది. బాధితుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఫీజులు నియంత్రణలో ఉండాలి

ఆంధ్రజ్యోతి జన వాక్యం

డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల మాదిరిగానే అన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో కూడా ఫీజుల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటోంది. ఇందులో భాగంగా జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయనుంది. ముఖ్యంగా ఫీజుల నియంత్రణపై ముసాయిదా చట్టం సిద్ధం చేసింది. దీనిపై పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఫీజుల నియంత్రణ ముసాయిదా చట్టంతో మేలు జరుగుతుందని, ముసాయిదా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరారు. ఫీజులు తక్కువ ఉంటే విద్యార్థులకు మేలు జరుగుతుందని వారు పేర్కొన్నారు.

● ఆంధ్రజ్యోతి- సూర్యాపేటటౌన్

ముసాయిదా చట్టంతో మేలు



రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీకళాశాలల్లో మాదిరిగా ఇంటర్ కళాశాలల్లో ఫీజుల నియంత్రణ ముసాయిదా చట్టం అమలు చేస్తే ఎంతో మందికి మేలు జరుగుతుంది. పేద విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. విద్యారంగంలో అనేక సంస్కరణలు జరిగే అవకాశం ఉంటుంది. విద్యారంగంలో కార్పొరేట్ వ్యవస్థ ఆగడాలను అరికట్టేలా చూడాలి. అనుమతులు లేని కళాశాలలు, పాఠశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పేద విద్యార్థులకు కళాశాలల్లో కొన్ని సీట్లు కేటాయించాలి.

● నిద్ర సంపత్‌నాయుడు, బీసీ విద్యార్థి సంఘం నాయకుడు

ఫీజులు తక్కువగా ఉండాలి



ప్రైవేట్ కళాశాలల్లో చదవాలంటే అధిక ఫీజులతో ఇబ్బందిగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. పేదలకు కళాశాలల్లో ఉచిత సీట్లకు పెద్దపీట వేయాలి. విద్యాహక్కు చట్టం అమలులో లేక ఇబ్బంది ఎదురవుతోంది. అమ్మానాన్న కలలను సాకారం చేయలేక అనేక మంది విద్యార్థులు ఫీజుల భారంతో విద్యకు దూరమవుతున్నారు.

● సూరారపు ప్రేమ్‌కుమార్,ఇంటర్ విద్యార్థి సూర్యాపేట

చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి. పిల్లలను చదివించాలంటే ఫీజులు భయంగా ఉంది. అధిక ఫీజులతో చదువులు చదివించలేక పోతున్నాం. గతంలో ఇలాంటి పేరెంట్స్, టీచర్స్ కమిటీలు ఉన్నా అవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రభుత్వం తీసుకొస్తున్న ఫీజు నియంత్రణ ముసాయిదా చట్టం మాలాంటి నిరుపేదలకు వరంగా ఉంటుంది.

● చిప్పలపల్లి వెంకటయ్య, సూర్యాపేట

కమిటీలో విద్యార్థి సంఘాలకు అవకాశం కల్పించాలి



పేరెంట్స్ టీచర్స్ కమిటీలో విద్యార్థి సంఘాలకు అవకాశం కల్పించాలి. 10మందితో కూడిన పేరెంట్స్ టీచర్స్ కమిటీలో విద్యార్థి సంఘాలకు అవకాశం ఉంటే చట్టం అమలు పటిష్ట అమలుకు అవకాశం ఉంటుంది. ఇందులో నలుగురు పేరెంట్స్ ముగ్గురు టీచర్స్ ఒకరు కళాశాల యాజమాన్యంతో పాటు ఇద్దరు విద్యార్థి సంఘం నాయకులు ఉండాలి. కార్పొరేట్ కళాశాల ఆగడాలు అరికట్టేలా చర్యలు తీసుకోవాలి.

● వెన్నెల, విద్యార్థి సంఘం నాయకురాలు

విత్తన పంపిణీకి సమాయత్తం



» టీజీ సీడ్స్ ఆధ్వర్యంలో నేటినుంచి పంపిణీకి ఏర్పాట్లు
» ఉమ్మడి జిల్లాలో 104 కేంద్రాల ద్వారా పంపిణీ
» సహకార సొసైటీలు, ఏఆర్ఎస్‌కేలు, డీసీఎంఎస్‌ల ద్వారా పంపిణీ
» 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

వానాకాలం సాగు కోసం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ(టీజీ సీడ్స్) విత్తనాలు అందుబాటులోకి తెచ్చింది. ఉమ్మడి జిల్లా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలోని 104 కేంద్రాల ద్వారా ఈ నెల 15 నుంచి విత్తనాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంది. 73 పీఏసీఎస్ కేంద్రాలు, 24 ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, ఐదు డీసీఎంఎస్ కేంద్రాలు, ఒక ఎఫ్‌పీవో కేంద్రం, టీజీ సీడ్స్ కార్యాలయం ద్వారా రైతులకు విత్తనాలు సరఫరా చేయనుంది.

- ఆంధ్రజ్యోతి - నిడమనూరు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అందుబాటులో ఉన్న విత్తనాలు

వరి 4,300 క్వింటాళ్లు
జీలుగ, 6,000 క్వింటాళ్లు
జనుము 690 క్వింటాళ్లు
కంది 20 క్వింటాళ్లు
వరి సన్నరకం 3500 క్వింటాళ్లు
వరి దొడ్డు రకం 800 క్వింటాళ్లు
వరి బీపీటీ 5204 క్వింటాళ్లు
జేజీఎల్ 27356 క్వింటాళ్లు

జిల్లా వారీగా కేటాయించిన విత్తనాలు

నల్లగొండ జిల్లాకు 4120 క్వింటాళ్లు
యాదాద్రి జిల్లాకు 1070 క్వింటాళ్లు
సూర్యాపేట జిల్లాకు 1500 క్వింటాళ్లు

పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము విత్తనాలు 50శాతం సబ్సిడీపై అందిస్తుండగా, వరి, అపరాలకు మాత్రం సబ్సిడీ లేదు. కానీ టీజీ సీడ్స్ కార్యాలయం సొంత విక్రయ కేంద్రాల్లో రైతులు నేరుగా విత్తనాలు కొనుగోలు చేస్తే ఆరు శాతం వరకు తగ్గింపు ఉంటుంది. రైతులంగా కలిసి రెండు టన్నుల విత్తనాలు కొనుగోలు చేస్తే ఆరు శాతం డిస్కౌంట్‌తో పాటు ఎలాంటి రవాణా ఖర్చులు లేకుండా నేరుగా ఆయా గ్రామాలకు పంపించనున్నారు. యాసంగి సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 5.50 లక్షల ఎకరాల్లో వరి పంటలు సాగు చేశారు. వానాకాలం సీజన్‌లో అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు. వివిధ రకాలైన మేలు రకం వరి విత్తనాలతో పాటు పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, కంది విత్తనాలు కూడా అందుబాటులో ఉంచింది. రైతుల అవసరాల మేరకు పెసర, మినుము విత్తనాలు కూడా తెప్పించేందుకు చర్యలు తీసుకుంది. వరి విత్తనాలు బీపీటీ 5204, జేజీఎల్ 27356 తదితర రకాల విత్తనాలు కిలోకు రూ.45.50 ఉంది. 25 కిలోల సంచులు రూ.1137.50లకు లభిస్తున్నాయి. ఆర్ ఎన్నార్ 15048 రకం వరి విత్తనాలు కిలో రూ.46.60 ఉంది, ఇవి 15కిలోల సంచుల్లో విక్రయిస్తున్నారు. దొడ్డు రకం వరి విత్తనాలు ఎంటీయూ1010, కేఎన్ఎం 118 రకం ఉన్నాయి. జీలుగ విత్తనాలు కిలో రూ.142.50, జనుము కిలో రూ.125.50లకు విక్రయిస్తున్నారు. వీటికి 50 శాతం సబ్సిడీ ఉంది. జీలుగ 30 కిలోలు, జనుము 40కిలోల సంచుల్లో దొరుకుతున్నాయి. అదే విధంగా కంది విత్తనాలు కిలో రూ.120 కాగా నాలుగు కిలోల సంచుల్లో అందుబాటులో ఉన్నాయి.

వానాకాలం సాగుకు సమాయత్తం

వీటిని ఉమ్మడి జిల్లాలోని ఆయా పంపిణీ కేంద్రాల ద్వారా రైతులకు విక్రయించనున్నారు. వీటితో పాటు పెసర, మినుములు కూడా తెప్పించేందుకు సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో లక్ష క్వింటాళ్ల వరకు సేకరించినందున, విత్తనాలకు ఎలాంటి కొరత ఉండదని, రైతుల అవసరం మేరకు తెప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు.

వానాకాలం సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. దుక్కులు కూడా దున్నుతున్నారు. సాగుకు విత్తన ఎంపికే ప్రధానం. మేలురకం విత్తనాలతో సాగు చేస్తేనే అధిక దిగుబడులు పొందే అవకాశం ఉంటుంది. విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించి, నాణ్యమైన విత్తనాలతో పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు అధికారుల సూచిస్తున్నారు.

నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నాం



వానాకాలం సీజన్ సాగు కోసం ఉమ్మడి జిల్లాలోని రైతాంగానికి అవసరమైన విత్తనాలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఈమేరకు ఆయా జిల్లాల్లోని పంపిణీ కేంద్రాలకు విత్తనాలు సరఫరా చేయడం జరిగింది. నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయడమే విత్తనాభివృద్ధి సంస్థ ముఖ్య లక్ష్యం. రైతుల మేలు కోసం సంస్థ అందిస్తున్న విత్తన డిస్కౌంట్ పద్ధతిని సద్వినియోగం చేసుకోవాలి.

- టి. వినయ్, రీజనల్ మేనేజర్, టీజీ సీడ్స్

మేలురకం విత్తనాలు ఎంపిక చేసుకోవాలి



పంటలు సాగు చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా మేలురకం విత్తనాలు ఎంపిక చేసుకోవాలి. నాణ్యమైన విత్తనాలతో పంటలు సాగు చేస్తేనే అధిక దిగుబడులు పొందగలుగుతారు. నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఆకర్షణీయమైన ప్యాకింగులు చూసి మోసపోవద్దు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వాలి.

- విజయచంద్ర, ఏఈవో, నిడమనూరు

వానాకాలం సాగుపై ఆశలు



యాసంగి సీజన్ ముగియడంతో వానాకాలం సాగుపై ఎన్నో ఆశలు పెట్టుకుని సేద్యానికి సిద్ధమవుతున్నాం. ప్రతి సీజన్‌లో కొందరు రైతులు నకిలీ విత్తనాలతో నష్టపోవాల్సి వస్తుంది. నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి ప్రవేశించకుండా అధికారులు చూడాలి. విత్తనాల ఎంపికపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలి. రైతులకు అవసరమైన మేలురకం విత్తనాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

- చింతకుంట్ల మల్లారెడ్డి, రైతు, బొక్కమంతలపహాడ్.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

● టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీని కలిసిన మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ● రూ.34 కోట్లు విడుదల చేయాలని వినతి



సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, మునుగోడు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు రూ.34 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కోరారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ ముఖ్య నాయకులతో హైదరాబాద్‌లోని టీజీ ఎస్పీడీసీఎల్ రాష్ట్ర కార్యాలయంలో సీఎండీ ముషారఫ్‌ను కలిశారు. నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వివరించారు. మునిసిపాలిటీలు, గ్రామాల్లో నెలకొన్న లో-ఓల్టేజీ సమస్య, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించాలని కోరారు. లూజ్ లైన్లు, నివాస గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలను తొలగించి ప్రమాదాలను నివారించాలని కోరారు. వెనుకబడిన మునుగోడును పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని అన్ని రకాల విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, వ్యవసాయాధిరిత ప్రాంతమైనందున రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. విద్యుత్ శాఖలో విధుల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు అవినీతికి పాల్పడుతున్నారని, ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు, ప్రజలను ఇబ్బంది పెడుతున్న సంఘటనలు తన దృష్టికి వచ్చాయని తెలిపారు.

సీఎండీ దృష్టికి సమస్యలు

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తమ దృష్టికి తెచ్చిన విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఎండీ ముషారఫ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వ్యవసాయ పొలాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్చాలన్నారు. అగ్రికల్చర్ డీపీఆర్‌లకు ఏబీ స్విచ్‌లు పెంచుతామని, మే, జూన్ మాసాల్లో ఏబీ స్విచ్‌లను మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, చౌటుప్పల్ మాజీ ఎంపీపీ చిల్కూరీ ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మునుగోడు ఇన్‌చార్జి పబ్బు రాజు, మునిసిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, సుర్వి నర్సింహ, బోయ దేవేందర్ పాల్గొన్నారు.

రైతులు సాగు ఖర్చు తగ్గించుకోవాలి



శివారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త చంద్రమోహన్

భూదాన్‌పోచంపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అందుబాటులో ఉన్న నూతన సాంకేతిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని తెలుసుకుని రైతులు సాగు ఖర్చు తగ్గించి నికర ఆదాయం పెంచుకోవాలని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రమోహన్, బాలచందు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని శివారెడ్డిగూడెం గ్రామంలో నిర్వహించిన రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రైతులకు వరి సాగులో మెలకువలను తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎ. శైలజ, ఏఈవో శిరీష, రామకృష్ణ, ఝాన్సీ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభం

మునుగోడు రూరల్: ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని మునుగోడు క్లస్టర్ హార్టికల్చర్ ఆఫీసర్ విద్యాసాగర్ తెలిపారు. మండల పరిధిలోని కిష్టాపురం గ్రామంలో ఆయిల్ పామ్ సాగుపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు ఆర్థిక స్థితిగతులు పెంపొందించేందుకు పంట సాగు ఉపయోగపడుతుందన్నారు. ఆయిల్ పంట సాగు చేసిన రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తుందన్నారు. బిందు సేద్యంపై ఎస్సీలకు ప్రభుత్వం 100శాతం, బీసీలకు 90 శాతం, ఇతరులకు 80శాతం రాయితీ కల్పిస్తుందన్నారు. ఎకరానికి ప్రభుత్వం నిర్వహణ ఖర్చుల నిమిత్తం రూ.4200 ఇస్తుందన్నారు. అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జాజుల అంజయ్యగౌడ్, ఏఈవో నిఖిల్, పాంటేషన్ ఆఫీసర్ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ స్వామి, మాజీ సర్పంచ్ నందిపాటి రాధా రమేష్, గ్రామ రైతులు కోనేటి భూమయ్య, పాండు, మారయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

బయోమైనింగ్ విధానం అమలు చేయాలి



డంపింగ్ యార్డులో అధికారులకు సూచనలిస్తున్న జేడీ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): ఘన వ్యర్థాల నిర్వహణకు బయోమైనింగ్ విధానం ఎందుకు అమలుచేయడం లేదని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ మునిసిపల్ అధికారులను ప్రశ్నించారు. మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మునిసిపల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. దశాబ్దాల క్రితం నియమితులైన ఎన్ఎంఆర్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు అవసరమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో కలిసి పట్టణంలోని డంపింగ్ యార్డును సందర్శించారు. బయో మైనింగ్ విధానంతో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని, స్థలం సరిపోదనే సమస్య ఉండదన్నారు. చెత్త నుంచి ఎరువుల ఉత్పత్తి చేయొచ్చని, రీసైక్లింగ్ జరపొచ్చన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ మార్గదర్శకాల మేరకు బయో మైనింగ్‌కు విధాన అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డంపింగ్ యార్డును పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పరిసరాలను పచ్చని చెట్లతో నింపాలన్నారు. ఆయన వెంట మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, టీపీవో కట్టెబోయిన అంజయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, ఆర్వో జ్ఞానేశ్వరి, అధికారులు శంకర్, చరణ్ తేజ, శ్వేత, షెహబాజ్, అనిల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటి మట్టం 512 అడుగులు



నాగార్జునసాగర్, మే 13(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590.00 అడుగులు(312.0450 టీఎంసీలు) కాగా, ప్రస్తుత నీటిమట్టం 512.90అడుగులు(136.6461 టీఎంసీలు)గా నమోదైంది. ఎడ మకాల్వ, కుడి కాల్వ, విద్యుత్‌కేంద్రం ద్వారా నీటి విడుదల లేదు. ఎస్ఎల్‌బీసీ ద్వారా 450 క్యూసెక్కులు, వరద కాల్వకు నీటి విడుదల లేదు. ఎగువ నుంచి నీటి రాక లేదు.

నాగార్జునకొండను సందర్శించిన బౌద్ధ భిక్షువులు



నాగార్జునకొండలోని బౌద్ధ స్తూపం వద్ద బౌద్ధ భిక్షువులు

నాగార్జునసాగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బౌద్ధక్షేత్రం నాగార్జునసాగర్ జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండను మంగళవారం మైసూరులోని సారా మఠానికి చెందిన నావాంగ్ జంగ్నీ, ఆయన శిష్యులు సందర్శించారు. మిస్ వరల్డ్ పోటీదారుల రాక సందర్భంగా ప్రత్యేక సోమవారం పూజా కార్యక్రమానికి వచ్చిన వారు మంగళవారం పర్యాటకశాఖ లాంచీలో నాగార్జునకొండకు చేరుకున్నారు. అక్కడ మ్యూజియం, సింహాళీయం, అశ్వమేథ యాగశాల, స్నాన వాటికలు, బౌద్ధమత స్తూపాలు, నమూనాలను తిలకించారు. నాగార్జునకొండపై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారివెంట బుద్ధవనం సీనియర్ అసిస్టెంట్ ఉన్నారు.

నాగవల్లీ దళార్చనలు



క్షేత్రపాలకుడికి హారతి ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మే 13 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణీ వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి ముఖమండపంలోని స్ఫటికమూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు.

ధ్రువీకరణపత్రాల పరిశీలన

భువనగిరి (కలెక్టరేట్), మే 13(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో పనిచేస్తూ వీఆర్వో వ్యవస్థ రద్దుతో ఇతర శాఖలకు వెళ్లిన వారిని గ్రామ పాలనాధికారుల పేరుతో తిరిగి తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. పలు శాఖలకు వెళ్లిన వీఆర్వోలు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో జీపీవో కోసం యాదాద్రి భువనగిరి జిల్లావ్యాప్తంగా 189 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారులకు సంబంధించిన ధ్రువీకరణపత్రాలను కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో మంగళవారం అధికారులు పరిశీలించారు. వీఆర్ఏ, వీఆర్వో, కారుణ్య ఇతర ద్వారా విధులు వారి అర్హతలు, అందుకు ప్రభుత్వ ఉత్తర్వులను పరిశీలించారు.

ఆటో డ్రైవర్ల హామీలు అమలు చేయాలి

భువనగిరి గంజ్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆటో రథయాత్ర మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలకు రూ.12వేలు ఇవ్వాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు. రూ.8వేలు ఉన్న ఇన్సురెన్స్‌ను రూ.వెయ్యికి తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షులు కొమ్ము జగదీష్‌బాబు, జై భీమ్ ఆటో వెల్ఫేర్ సొసైటీ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కర్తాల శ్రీనివాస్, ఎస్‌కే నిజాం, బింగి సురేష్, మాటూరి నాగరాజు, తారాల ఉపేందర్ పాల్గొన్నారు.

వేసవిలోనూ నిండు కుండలా..

● రెండు సీజన్లకు సాగు నీరిచ్చినా తగ్గని మూసీ ప్రాజెక్టు నీరు ● పెరుగుతున్న నీటి మట్టం



నీటితో తొణికిసలాడుతున్న మూసీ రిజర్వాయర్

కేతేపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): వేసవి ఎండలు మండుతున్న పరిస్థితుల్లోనూ మూసీ ప్రాజెక్టు నీటితో నిండుకుండలా తొణికిసలాడుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద నీటివనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు ఈ ఏడాది తరగని నీటినిల్వలతో కళకళలాడుతోంది. ఈ ఏడాది వానాకాలం, యాసంగి సీజన్లలో దాదాపు 35వేల ఎకరాల ఆయకట్టుతో పాటు అంతే విస్తీర్ణంలో అక్రమంగా పంపుసెట్లతో నీటి తరలింపు ద్వారా నాన్ ఆయకట్టు భూముల్లో పంటలను రైతులు సాగు చేశారు. అయినా ఎగువ మూసీ పరీవాహక ప్రాంతాలు, హైదరాబాద్ నుంచి నిరంతరాయంగా కొనసాగుతున్న ఇన్‌ఫ్లోతో ప్రాజెక్టు నీటిమట్టం ఒక్కో అడుగు పెరుగుతూ వస్తోంది. 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 634.20అడుగులు(2.04టీఎంసీలు)గా ఉంది. గత ఏప్రిల్ 6న యాసంగి సీజన్ పంటలకు సాగు నీటి విడుదలను నిలిపి వేసే నాటికి 623.50అడుగులు (0.71టీఎంసీలు)గా ఉన్న ప్రాజెక్టు నీటిమట్టం 37 రోజుల్లో 10.07అడుగుల మేర పెరిగి ప్రస్తుతం 634.20 అడుగులకు చేరింది. ప్రస్తుతం ఎగువ నుంచి 489.11 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టు నీటిమట్టం 629.15అడుగులుగా ఉండగా ఈ ఏడాది 5అడుగుల మేర నీరు అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో అకాల వర్షం కురిసి ఇన్‌ఫ్లో ఏమాత్రం పెరిగినా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకునే వీలుంది. దీంతో ప్రాజెక్టు ఇంజనీరింగ్ యంత్రాంగం ప్రాజెక్టు గేట్ల నిర్వహణ సులువు చేసే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రాజెక్టు క్రస్టు, రెగ్యులేటరీ గేట్లు, గేట్లను ఎత్తేందుకు వినియోగించే విద్యుత్ మోటార్ల పుల్లీలకు ఆయిలింగ్, గ్రీజింగ్ పనులు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

అలసి సొలసి..



ఎండ తీవ్రత అధికమవడంతో పశు పక్ష్యాదులు ఆపసోపాలు పడుతున్నాయి. ఎండ వేడిమికి తాళలేని కొన్ని వానరాలు(కోతులు) మంగళవారం ఇలా తలదాచుకున్నాయి. యాదగిరిగుట్టలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రొటోకాల్ కార్యాలయం పక్కన గోడకు తీర్చిదిద్దిన గజేంద్రుల ప్రతిమల మధ్య ఉన్న రథం నీడన సేదతీరాయి.

● యాదగిరిగుట్ట, ఆంధ్రజ్యోతి.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

శాలిగౌరారం, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేయనున్నట్లు తహసీల్దార్ యాదగిరి తెలిపారు. మండలకేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటలకు ఎమ్మెల్యే మందుల సామేల్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత

నల్లగొండరూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): పదో తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో నల్లగొండ పట్టణానికి చెందిన విపస్య స్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. స్కూల్‌కు చెందిన 60శాతం విద్యార్థులు మొదటిర్యాంకులో పాస్ అయినట్లు తెలిపారు. బండారు తనుష్ 563/600, పిన్నపురెడ్డి శ్రీచందన 550, కందగట్ల సాయి చరణ్ 537 మార్కులను సాధించారు. మంచి ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ఆ పాఠశాల చైర్మన్ బండారు ప్రసాద్ అభినందించారు.

కరెంట్ కష్టాలు

» లోవోల్టేజీ సమస్యతో ఇక్కట్లు
» శివారుతో ప్రాంతాలతో పాటు కొన్ని కాలనీల్లో ఇబ్బందులు
» అడపాదడపా నిలిచిపోతున్న సరఫరా
» ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలు


నల్లగొండ పట్టణంలోని సబ్‌స్టేషన్

నల్లగొండ/నల్లగొండ టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో పలుచోట్ల విద్యుత్ లో వోల్టేజీ సమస్యలతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కేంద్రంలో 48 వార్డులు ఉన్నాయి. అయితే ప్రధానంగా శివారు కాలనీలతో పాటు పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో లో వోల్టేజీ సమస్య అధికమైనట్లు సమాచారం. పట్టణం విస్తరించడం తోడు కొత్త కాలనీలు ఏర్పాటు కావడం, కొత్తగా ఇళ్ల నిర్మాణాలు పెరగడంతో విద్యుత్ అవసరం కూడా పెరిగింది. గతంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలోనే కొత్త కనెక్షన్లు ఇస్తుండటంతో తరచుగా ట్రిప్పు అవుతుంది. కొద్ది రోజుల క్రితం నల్లగొండ పట్టణంలోని హనుమాన్‌నగర్ ప్రాంతంలో కొద్దిపాటి వర్షానికి, గాలి దుమారానికి కొన్ని ఇళ్లకు కరెంటు నిలిచిపోయింది. ఆ వార్డులో చుట్టు పక్కల కరెంటు ఉండగా కొన్ని ఇళ్లల్లో నిలిచిపోయింది. సంబంధితశాఖ పట్టించుకోకపోవడంతో తెల్లవార్లు ఆ ప్రాంత గృహ వినియోగదారులు వేసవి ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సంబంధిత శాఖ అధికారులకు ఫోన్ చేసిన కూడా స్పందించలేదని, మరునటి రోజు ఉదయం కరెంటు సరఫరా పునరుద్ధరించారని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం 40 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎండలు మండిపోతుండగా అర్ధరాత్రి వరకు ఉక్కపోత ఉంటుంది. మే నెల కావడంతో ఎండల తీవ్రత పెరుగుతున్న సమయంలో అడపాదడపా కరెంటు పోవడం వల్ల ప్రజలు సతమతమవుతున్నారు.

శివారు ప్రాంతాలకు తప్పని తిప్పలు

జిల్లా కేంద్రంలోని శివారు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. తరచుగా ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవుతున్నాయి. మునిసిపాలిటీలో విలీనమైన పలు గ్రామాల్లో కరెంట్ సమస్య, లో వోల్టేజీ, లూజ్ లైన్ల సమస్య, ఇళ్ల పై నుంచి కరెంట్ వైర్ల తొలగింపులో జాప్యం జరుగుతుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల కేటాయింపు ప్రతిపాదనలకే పరిమితమైన పరిస్థితి. నాణ్యమైన విద్యుత్ సరఫరా కాకపోవడంతో ఆయా ప్రాంతాలలోని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నల్లగొండ పట్టణంలోని 48 వార్డుల్లో సుమారు 83 వేలకు పైగా గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు సమాచారం. ప్రతియేటా కొత్త నిర్మాణాలు జరుగుతుండటంతో కనెక్షన్ల సంఖ్య పెరుగుతుంది. గృహ విద్యుత్ సంఖ్యకు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయకపోవడంతో లోవోల్టేజీ సమస్య ఎదురవుతుంది. అదనంగా సబ్‌స్టేషన్ నిర్మాణంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని గృహ వినియోగదారులు కోరుతున్నారు. ఉదాహరణకు శేషమ్మగూడెం, పానగల్, ఎన్జీవో కాలనీ, ఆదిత్య కాలనీ, లెప్రసీ కాలనీతో పాటు కేశరాజుపల్లి, కతాల్‌గూడెం, గంధవారిగూడెం, చర్లపల్లి ప్రాంతాలల్లో లో వోల్టేజీ సమస్య ఉన్నట్లు సమాచారం. అదేవిధంగా మిగతా శివారు ప్రాంతాలతో పాటు జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో కూడా ఈ సమస్య ఎదురవుతున్నట్లు తెలిసింది. వెంటనే సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

లో వోల్టేజీ సమస్య దృష్టికి రాలేదు

లో వోల్టేజీ సమస్య మా దృష్టికి రాలేదు. పట్టణంలో ఎక్కడైనా లోవోల్టేజీ సమస్య ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడంతో పాటు తగిన చర్యలు తీసుకుంటా. ముఖ్యంగా వేసవి ప్లాన్‌లో భాగంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే అదనంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ప్రతిపాదనలు కూడా పంపాం.

ఎం.వేణుగోపాలచార్యులు, ఏడీఈ నల్లగొండ

రెండోరోజూ కొనసాగిన సొడమ్మ జాతర


మాణిక్యమ్మ వేషధారణలో ఉన్న యువకుడిని ఎత్తుకెళ్తున్న మహిళలు

కేతేపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం కేతేపల్లిలో సోమవారం ప్రారంభమైన యాదవుల ఆరాధ్య దైవం సొడమ్మ జాతర మంగళవారం రెండోరోజూ కొనసాగింది. మహిళలు తమ ఆరాధ్యదైవం సొడమ్మకు నైవేద్యా లు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా యువతీ, యువకులు కోలాటాలు, మాణిక్యమ్మ వేషధారణలతో అందరినీ అలరించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వ్యవసాయ భూముల్లో వదిలిన పొడుపు గొర్రెను పట్టుకునేందుకు యువకులు పోటీలు పడ్డారు. వేడుకలను తిలకించేందుకు రెండో రోజు పరిసర గ్రామాలకు చెందిన వారు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. వేడుకల్లో కేతేపల్లి మాజీ సర్పంచ్ జె.ముత్తమ్మ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు జె.వెంకటనర్సయ్య యాదవ్, వి.అబ్బయ్య, జె.నాగయ్య, యు.సైదులు, కె.రమేష్, యు.సోమలింగయాదవ్, జె.సైదులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

చిట్యాల, మే13 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి అన్నారు. చిట్యాలలో మంగళవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులకు రూ.15 లక్షల వరకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించే హెల్త్‌కార్డులు ఇప్పించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అందిరికీ అక్రిడిటేషన్ కార్డుల కోసం ప్రభుత్వంతో సంప్రదింపులు చేస్తున్నట్లు తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోసం జర్నలిస్టులు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మెండె వెంకన్న, గౌరవాధ్యక్షుడు పెద్ది నరేందర్, సలహాదారుడు మిర్యాల ప్రకాష్, ప్రధాన కార్యదర్శి పోకల కరుణాకర్, కోశాధికారి చెరుపల్లి శ్రీనివాస్ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కలిమెల నాగయ్య, జిల్లా నాయకులు దోసపాటి సత్యనారాయణ, ఏళ్ల బయ్యన్న, చంద్రశేఖర్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి రూ.2లక్షల విరాళం

నార్కట్‌పల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న గ్రామ దేవతల ఆలయాలను పూర్తి చేసేందకు అవసరమైన నిధుల సమీకరణలో భాగంగా ఎమ్మెల్యే వేముల వీరేశం రూ.2లక్షల విరాళాన్ని ఉత్సవ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ ఐతరాజు యాదయ్య, దూదిమెట్ల సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, రాధారపు బిక్షపతి, సామ కొండల్‌రెడ్డి, మిర్యాల రాములు, కమ్మంపాటి రాములు, ప్రజ్ఞాపురం విజయ్ సింహ, సంపత్, లింగస్వామి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పెద్దకాపర్తిలో కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం

చిట్యాలరూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల నాయకుడిగా ఎంపి ఈటల రాజేందర్‌ను విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి లేదని బీజేపీ మండల అధ్యక్షుడు పీక వెంకన్న అన్నారు. ఈటలపై జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం చిట్యాల మండలం పెద్దకాపర్తిలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల బాగోగులు చూసే రాజేందర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. జగ్గారెడ్డి ఈటలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పొట్లపల్లి నర్సింహ, బీజెవైఎం జిల్లా కార్యదర్శి పున్న విష్ణు, నాయకులు గరిషె నరేష్, సిలివేరు నర్సింహ, ఈరటి సురేష్, వెంకన్న, తిరుమలేష్, లింగస్వామి, నర్సింహ, రాజు, విజయ్, గణేష్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయం

నార్కట్‌పల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని పురాతన ప్రసన్నాంజనేయస్వామి ఆలయాన్ని తన సొంత ఖర్చుతో అభివృద్ధి చేసేందుకు పట్టణానికి చెందిన వ్యాపారవేత్త యాద వెంకన్న ముందుకు రావడం అభినందనీయమని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. పురాతన ఆలయ అభివృద్ధి కోసం సహకరించాలని ఆలయ అర్చకుడు, అభివృద్ధి కమిటీ సభ్యులు యాద వెంకన్నను సంప్రదించగా ఆయన వెంటనే స్పందించాడు. నూతన ధ్వజస్తంభం ఏర్పాటు, ప్రహరీ గోడ నిర్మాణంతో పాటు ఆలయానికి అవసరమైన ఇతర అభివృద్ధి పనులను తన సొంత ఖర్చుతో చేయస్తానని హామీ ఇచ్చారు. మంగళవారం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో దాత వెంకన్నను అర్చకుడు గుండేపూడి జానకిరామశర్మ ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పసునూరి శ్రీనివాస్, దయాకర్, పాండురంగయ్య, జెరిపోతుల భరత్, ఇడుకుళ్ల బిక్షమయ్య, పసునూరి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు సౌకర్యాలు కల్పించడంలో విఫలం


కూలీలతో మాట్లాడుతున్న నరసింహ

నాంపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొలుగురి నరసింహ అన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలతో ఆ యన మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం నరసింహ మాట్లాడుతూ ఏడు వారాలుగా కూలీలకు వేతనాలు రావడం లేదని, పని ప్రదేశాల్లో కనీ స సౌకర్యాలు కల్పించకపోవడంతో ఉపాధి హామీ కూలీలు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో మంచినీరు టెంట్ సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు సామగ్రిని ఇవ్వాలని, అదేవిధంగా పని దినాలు 200 రోజులు కల్పించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజువారీ వేతనం రూ.700 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో ఫొటోస్ స్కానింగ్ విధానాన్ని ఎత్తివేయాలని, నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల జీతాలు, కూలి వెం టనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు ఎండీ జానిమియా, నాంపల్లి మండల కార్యదర్శి నేరెళ్ల సైదయ్య, కూలీలు పెళ్లిజాల కవిత, పల్లె సైదమ్మ, అందుకుల లక్ష్మమ్మ, జిల్లెల్ల యాదమ్మ, వెలిజాల ముత్యాలు, జెల్లెల పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేద కుటుంబానికి అండగా ప్రభుత్వం


ఎల్‌వోసీ బాండ్‌ని అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

గట్టుప్పల్, మే 13(ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దండు యాదగిరిరెడ్డి, రావుల రమేష్ అన్నారు. గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన కుండే సుజాతకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 1.80లక్షల ఎల్‌వోసీని మంగళవారం ఆమె కుటుంబసభ్యులకు వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు.

కోర్టులో ఉద్యోగాల పేరుతో మోసం

● 3 నెలలుగా రూ.10.32 లక్షలు వసూలు ● మహిళా న్యాయవాది, గుమస్తాను అరెస్ట్ చేసిన పోలీసులు


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

తిప్పర్తి, మే 13(ఆంధ్రజ్యోతి): కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగుల నుంచి రూ.10.32లక్షలు వసూలు చేసిన ఇద్దరిని తిప్పర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శివరాంరెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నల్లగొండ పట్టణానికి చెందిన ఎండీ నసీర్ నల్లగొండ కోర్టులో విధులు నిర్వహిస్తున్న న్యాయవాదులకు గుమస్తాగా పనిచేస్తూనే, పలు కేసులపై ఆర్టీఐ దరఖాస్తులు దాఖలు చేసేవాడు. నల్లగొండకు చెందిన జ్యోతిరాణి జూనియర్ అడ్వకేట్‌గా పనిచేస్తుండగా, ఇద్దరికీ కోర్టులో పరిచయమైంది. ఈ క్రమంలో ఇరువురు కలిసి వివిధ రకాల సమస్యలు, కోర్టులో కేసుల నిమిత్తం వచ్చే నిరుద్యోగ, యువతీ, యువకులతో మాట్లాడుతూ వారికి కోర్టులో స్వీపర్, అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికారు. నల్లగొండ, తిప్పర్తి, మాడ్గులపల్లి మండలాల పరిధిలోని 31మంది నిరుద్యోగుల నుంచి ఒక్కొక్కరి నుంచి రూ. 20వేల నుంచి రూ.50వేల చొప్పున మొత్తం గత మూడు నెలలుగా రూ.10.32లక్షలు వసూలు చేశారు. ఉద్యోగం గురించి అడిగినప్పుడల్లా మాట దాటవేస్తున్నారు. తిప్పర్తి మండల పరిధిలోని ఇండ్లూరుకు చెందిన బాధితురాలు ఏపూరి హెప్సిబా ఈ నెల 7వ తేదీన ఫిర్యాదు చేయటంతో వారిద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా, నేరం అంగీకరించారు. నసీర్, జ్యోతిరాణిపై తిప్పర్తి, మాడ్గులపల్లి, నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో 7 కేసులు నమోదయ్యాయని, వారినుంచి రూ.10వేల నగదు, ద్విచక్ర వాహనం, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. నిరుద్యోగులు ఎవరూ హామీలను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రస్తుతం ప్రతీ ఉద్యోగానికి పత్రికా ప్రకటనతో పాటుగా రాత పరీక్ష ఉంటుందన్నారు. సమావేశంలో సీఐ కె.కొండల్‌రెడ్డి, ఎస్ఐ బి.సాయిప్రశాంత్, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి : శంకర్‌నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

మునుగోడు, మే 13(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మునుగోడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన పేదలకు అందేలా చూడాలని తెలిపారు. సమావేశంలో చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు భీమనపల్లి సైదులు, రవీందర్‌రెడ్డి, రాందాస్ శ్రీను, జగన్నాధం, ఓంకారం, అనంత చంద్రశేఖర్‌గౌడ్, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి : సీపీఎం


ఆస్పత్రిలో నవీన్‌ను పరామర్శిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి

కనగల్, నల్లగొండరూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): యువకుడు ఆస్పత్రి పాలయ్యేలా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. కనగల్ మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. నల్లగొండ మండలం పానగల్‌కు చెందిన కుంచం నవీన్ అదే ప్రాంతానికి చెందిన ఓ యువతి ఇరువురు ఒకరినొకరు ప్రేమించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న అమ్మాయి తరుపు వారు ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుతో కనగల్ పోలీసులు నవీన్‌ను తీవ్రంగా కొట్టి ఆసుపత్రి పాలయ్యేలా చేసారని ఆరోపించారు. పోలీసుల సమక్షంలోనే అమ్మాయి తరుపువారు కూడా నవీన్‌ను కొట్టడం ఏమిటని ప్రశ్నించారు. నవీన్ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని వివరించారు.

ఫ్రెండ్లీ అంటే విచక్షణరహితంగా కొట్టడమేనా అని ఆయన ప్రశ్నించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నవీన్‌ను పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో సమావేశంలో సీపీఎం నాయకులు దండెంపల్లి సత్త య్య, కానుగు లింగస్వామి, సైదులు, సుల్తానా, రాములు, శివ, ఎల్లయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కొట్టారన్న ఆరోపణలు అవాస్తవం: ఎస్ఐ విష్ణుమూర్తి

ఓ అమ్మాయి తరపు వారు ఇచ్చిన మిస్సింగ్ ఫిర్యాదు మేరకు పానగల్‌కు చెందిన కుంచు నవీన్ అనే యువకుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టామే తప్ప అతడిని కొట్టలేదని ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు. మా కస్టడీలో ఉన్నప్పుడు అతడిపై ఎవరు దాడి చేయలేదని పేర్కొన్నారు. పోలీసులపై ఇష్టానుసారంగా ఆరోపణలు చేయటం సరికాదన్నారు. తప్పిపోయిన అమ్మాయి ఆచూకీ లభించిందని వివరాలు వెల్లడిస్తామన్నారు.

నకిరేకల్ ఆస్పత్రిలో 'ఊయల' ఏర్పాటు

నకిరేకల్, మే 13 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా శిశు సంక్షేమ ఆధ్వర్యంలో మంగళవారం ఊయలను ఆసుపత్రి సూపరింటెండెంట్ శోభారాణి, ఐసీడీఎస్ సీడీపీవో అస్రాఅంజుమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు తమకు భారం అనుకున్న తల్లిదండ్రులు శిశువులను చెట్లపొదలు, మురికి కాల్వల్లో వదిలేస్తున్నారని అన్నారు. అలాంటి శిశువులను, వదిలివేయబడిన వారి రక్షణ కోసం ప్రభుత్వం ఊయల కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఎవరినైనా అనాథ బాలలుగా వదిలివేయవద్దని, పిల్లలను పోషించలేని వారు ఆ పిల్లలను ఆస్పత్రిలో ప్రారంభించిన ఊయలలో అప్పగించాలని సూచించారు. వారి వివరాలు ఎవరికీ తెలియజేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ ఉమ, డీసీపీయూ సిబ్బంది తేజస్విని, ఎన్.రేవతి, సూపర్‌వైజర్లు జి.సునీత, ఎన్.భవాని, ఎం. జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైఐఎఫ్ అధికార ప్రతినిధిగా నర్సింహ


నర్సింహ

నార్కట్‌పల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): యాదవ విద్యావంతుల వేదిక (వైఐఎఫ్) నల్లగొండ జిల్లా అధికార ప్రతినిధిగా నార్కట్‌పల్లి మండలంలోని చిన్ననారాయణపుం మాజీ సర్పంచ్ కొత్త నర్సింహయాదవ్ నియమితులయ్యారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వేదిక జిల్లా అధ్యక్షుడు బెల్లి నాగరాజుయాదవ్ నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన వైఐఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చలకాని వెంకన్న, ప్రధాన కార్యదర్శి దూదిమెట్ల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు బెల్లి నాగరాజు, బాలరాజుయాదవ్‌లకు నర్సింహ కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా కార్యదర్శిగా నోముల క్రాంతి


క్రాంతియాదవ్

శాలిగౌరారం: యాదవ విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శిగా శాలిగౌరారం మండలం అంబారిపేట గ్రామానికి చెందిన నోముల క్రాంతియాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు నాగరాజుయాదవ్ నియామకపత్రాన్ని క్రాంతియాదవ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతియాదవ్ మాట్లాడుతూ యాదవుల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. తన నియమాకానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎం.ఎడవల్లి చెరువును ఉదయసముద్రం నీటితో నింపాలి

నార్కట్‌పల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని ఎం.ఎడవల్లి చెరువును బీ.వెల్లెంల ఉదయ సముద్రం రిజర్వాయర్ నీటితో నింపాలని మాధవఎడవల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం (ముదిరాజ్) అధ్యక్షుడు తుపాకుల వెంకటేశం కోరారు. మంగళవారం నకిరేకల్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. పదేళ్లుగా చెరువులో నీరు లేకపోవటంతో మత్స్య సంపదపైనే ఆధారపడిన 50 కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని పేర్కొన్నారు.

సిబిల్ స్కోరు నిబంధన ఎత్తివేయాలి

నార్కట్‌పల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస పథకం అర్హత కోసం పెట్టిన సిబిల్ స్కోరు నిబంధనను ఎత్తివేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లె పరమేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దరఖాస్తుల గడువు పూర్తయిన తర్వాత ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపికను సిబిల్ స్కోరు ప్రాతిపదికన చేస్తామని చెప్పడం సరైంది కాదన్నారు. నిరుద్యోగుల్లో కొంత మందికి ఇంకా బ్యాంకు ఖాతాలే లేకుంటే సిబిల్ స్కోరు ఎలా ఉంటుందో చెప్పాలని అన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి


సీఎంను కలిసిన కిరణ్‌కుమార్

శాలిగౌరారం, మే 13 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి, రాష్ట్ర నాయకుడు నూక కిరణ్ కుమార్ యాదవ్ కోరారు. హైదరాబాద్‌లో మంగళవారం మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన కిరణ్ కుమార్‌యాదవ్ సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. బీసీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని సీఎంకు విన్నవించారు. సీఎం సానుకూలంగా స్పం దించినట్లు కిణ్ కుమార్‌యాదవ్ తెలిపారు.

ట్రక్ చీట్

(మొదటి పేజీ తరువాయి)

తర్వాతనే ఫైనల్‌గా ఆమేరకు తూకం తగ్గించి ట్రక్‌షీట్ ఖరారు చేస్తున్నారని, దాని ఆధారంగానే ట్యాబ్‌లలో ఎంట్రీ చేయాల్సి ఉండడం వల్లే ట్యాబ్‌లలలో ఎంట్రీ అయ్యే ధాన్యానికి, కేంద్రాల వద్ద కాంటాలు వేసిన ధాన్యానికి మధ్య తేడా వస్తోంది. రైతులకు నష్టం కలిగిస్తోన్న ఈ వ్యవహారాన్ని అడుగడుగునా పరిశీలించి, రైతులను కాపాడాల్సిన అధికారులు మిన్నకుండిపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని రైతాంగం వాపోతోంది.

సన్నధాన్యమంతా మిల్లులకే...

జిల్లాలో ఈ సీజన్‌లో 12.14 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉత్పత్తవుతుందని అంచనావేయగా, అందులో 6.50లక్షల మెట్రిక్‌టన్నుల వరకు సన్నధాన్యముంటుందని అంచనా వేశారు. ఇందులో సగమైనా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనాలని నిర్ణయించి, ఇందుకోసం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే క్వింటాకు రూ.500 బోనస్ కూడా ఇస్తామని ప్రకటించారు. అయితే జిల్లాలో బోనస్‌ని రైతాంగం పట్టించుకోలేదు. సన్నధాన్యం వచ్చింది వచ్చినట్లుగా మిల్లులకే నేరుగా విక్రయించారు. జిల్లావ్యాప్తంగా సన్నధాన్యం కోసం 39 కేంద్రాలు ప్రత్యేకంగా ప్రారంభించినా ధాన్యం రాకపోవడంతో 29 కేంద్రాలే కొనసాగించారు. ఇప్పటివరకు జిల్లాలో రూ.35.44 కోట్ల విలువైన 15,278 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. మరో 1500 మెట్రిక్ టన్నుల వరకు సన్నధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో పండిన దాదాపు 6.50లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం మొత్తానికి మొత్తంగా మిల్లుల వద్దనే రైతులు అమ్ముకోవడం గమనార్హం. మిల్లుల వద్ద ధాన్యానికి మద్దతు ధర కంటే ధర తక్కువే ఇచ్చినా, తూకం వెంటనే వేయడంతోపాటు, పచ్చిధాన్యం సైతం కొనుగోలు చేశారని, మిల్లులోని అధునిక టెక్నాలజీ మిల్లర్లకు ఇందుకు ఉపయోగపడిందని చెబుతున్నారు. సన్నధాన్యాన్ని ఆరబెడితే క్వింటాకు దాదాపు 10 కిలోలవరకు తూకం తేడా వస్తోందని, అదే మిల్లుల వద్ద నేరుగా ఇస్తే ఆమేర కలిసొస్తుందని, ప్రభుత్వమిచ్చే బోనస్‌తో ఇంతకు మించి వచ్చేదేమీ లేదని, అందువల్లే నేరుగా మిల్లర్లకు అమ్మేస్తున్నామని రైతులు చెబుతుండడం గమనార్హం.


వీలైనంత వేగంగా కొనుగోళ్లు పూర్తిచేయాలనే..

జిల్లాలో 375 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 4,88,494 మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. కేంద్రాల వద్ద ఇంకో 28,103 మెట్రిక్‌టన్నుల ధాన్యం కాంటాలు వేయాల్సి ఉందని చెబుతున్నారు. మరో 35వేల మెట్రిక్‌టన్నుల వరకు ధాన్యం కేంద్రాలకు వస్తుందని అంచనావేసిన అధికారయంత్రాంగం ఈవారంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకొంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 67,866 మంది రైతులకు సంబంధించి రూ.1133.31 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా, ఇందులో 52,369 మంది రైతులకు సంబంధించి రూ.810.10 కోట్ల డబ్బు రైతుల ఖాతాల్లో జమచేశామని చెబుతున్నారు. ఇంకో రూ.2.65 కోట్ల డబ్బులు ఒకటి, రెండు రోజుల్లో జమవుతుందని పేర్కొన్నారు. ట్యాబ్‌లలో నమోదయ్యాక రెండు, మూడు రోజుల్లో నగదు రైతుల ఖాతాల్లో వేస్తున్నామని, గరిష్టంగా అయిదు రోజుల్లో డబ్బు రైతులకు చేరుతుందని పేర్కొంటున్నారు.

కొనుగోళ్లు వేగంగా నిర్వహిస్తున్నాం

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరుపుతున్నాం. కేంద్రాల వద్ద ధాన్యం నిల్వ ఉండకుండా కాంటాలు వేయిస్తున్నాం. మిల్లుల వద్ద దిగుమతి జాప్యమవుతుండడంతోనే ట్యాబ్ ఎంట్రీలలో జాప్యం జరుగుతోంది. మిల్లుల వద్ద ధాన్యం తూకంలో కోత విధిస్తున్నారనే అంశం మా దృష్టికి రాలేదు. ఎక్కడైనా సమస్య ఉంటే తెలియజేస్తే చర్యలు తీసుకుంటాం. దిగుమతుల ఆలస్యంతోనే కొనుగోలు కేంద్రాల్లో తూకానికి, ట్రక్‌షీట్లలో తూకానికి మధ్య తేడా కనిపిస్తుంది. మిల్లుల వద్ద కాంటాలు పూర్తయ్యాక పూర్తి వివరాలతో ట్యాబ్‌లలో, ట్రక్‌షీట్లలో ఎంట్రీ చేస్తారు. ఈ వారంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ దాదాపు ముగించే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

- హరీష్, డీఎం, సివిల్‌సప్లయిస్ కార్పొరేషన్, నల్లగొండ



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.170	260	290
సూర్యాపేట	రూ.174	260	290
నల్లగొండ	రూ.165	245	270

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.0 । కనిష్ఠం 25.0

రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం

కొనుగోలు చేయాలి: కలెక్టర్



దేవరకొండలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, పక్కన ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, కొండమల్లేపల్లి, డిండి, మే 13 (ఆంధ్రజ్యోతి):రైతులను ఇబ్బంది పెట్టకుండా మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి మిల్లర్లను ఆదేశించారు. దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని రైస్‌మిల్లర్లు, అధికారులతో ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి సమీక్షించారు. లారీల కొరతలేకుండా చూడాల్సిన బాధ్యత మిల్లర్లపై ఉందన్నారు. రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులను ఇబ్బం ది పెట్టకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చిన వెంటనే ధాన్యం కొనుగో ల చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడు తూ రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ, డీసీఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఎం హరీష్, ఆర్డీవో రమణారెడ్డి, రైస్‌మిల్లర్లు, అధికారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

కొండమల్లేపల్లి, డిండి మండలాలలోని కొనుగోలు కేంద్రాలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలోని రైతులతో మాట్లాడి అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లారీల కొరత కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ఉండిపోతున్నాయని తెలిపారు. స్పందించిన కలెక్టర్ లారీల యాజమాన్యంతో మాట్లాడి ధాన్యం వేగంగా తీసుకెళ్లి అన్‌లోడ్ చేయించాలని మిల్లు యజమానులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రానికి వచ్చిన ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామన్నారు. డిండి మండలంలోని చెర్కుపల్లి, కామేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆయనవెంట అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హరీష్ పాల్గొన్నారు.

ట్రక్‌చీట్



యాసంగి ధాన్యం విక్రయాల్లో రైతులకు అవస్థలు తప్పడం లేదు. నాణ్యత, తేమశాతం, తా లు తదితరాల పేరుతో మిల్లుల వద్ద ధాన్యం తూకంలో కోత విధిస్తున్నా కిమ్మనకుండా అంగీకరించాల్సిన దుస్థితి కొనసాగుతోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద తూకం వేసిన వెంటనే ట్రక్‌షీట్లు రాసి, ట్యాబ్‌లలో ఎంట్రీ చేయాల్సి ఉండగా, మిల్లుల వద్ద దిగుమతి అయ్యా క వచ్చే తూకం మేరకే ట్రక్‌షీట్ రాసి ట్యాబ్‌లలో ఎంట్రీ చేస్తున్నారు. దీంతో రైతులకు క్వింటాకు మూడు శాతం మేర తగ్గించి బిల్లులిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- కేంద్రాల వద్ద తూకానికి, ట్రక్‌షీట్లలో తూకానికి మధ్యతేడాలు
- మిల్లుల తూకం మేరకే ట్రక్‌షీట్లు
- మిల్లుల వద్ద తూకం నిర్ణయించాకే ట్రక్‌షీట్‌లు రాస్తున్న వైనం
- మూడు శాతం వరకు తూకంలో కోత విధిస్తున్నారనే ఆరోపణలు

జిల్లావ్యాప్తంగా కోతలు విధిస్తూ బిల్లులు చెల్లిస్తున్నారు. మిల్లర్లను గట్టిగా నిలదీస్తే ధాన్యం దింపుకోబోమని వెనక్కి పంపిస్తుండడంతో చేసేదేమీ లేక రైతులు, కేంద్రాల నిర్వాహకులు మిల్లర్లు ఇచ్చిన తూకం మేరకు ట్రక్‌షీట్ రాసి బిల్లులు జనరేట్ చేస్తున్నారు. ఇందువల్లే కేంద్రాల వద్ద కాంటాలైన ధాన్యానికి, ట్రక్‌షీట్ జనరేట్ అయిన ధాన్యానికి మధ్య దాదాపు 93వేలమెట్రిక్ టన్నుల ధాన్యం తేడా కనిపిస్తోంది.

మిల్లర్లు ఇచ్చిన తూకాల మేరకే ట్రక్‌షీట్ నమోదు

కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కాంటాలు వేసిన వెంటనే ట్రక్‌షీట్ జనరేట్ చేయాల్సి ఉండగా, జిల్లాలో సగానికిపైగా కేంద్రాల్లో అందుకు విరుద్ధంగా మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి అయ్యాక మిల్లర్లు నిర్ధేశించిన తూకం మేరకే ట్రక్‌షీట్ నమోదు చేస్తున్నారు. కేంద్రాల వద్ద ధాన్యం రైతులవారీగా, లాట్లవారీగా తూకం వేసి నామినల్‌గా తెల్లకాగితాలపై నమోదు చేసి మిల్లుల వద్దకు పంపిస్తున్నారు. మిల్లుల వద్ద ధాన్యాన్ని పరిశీలించి తేమ, తాలు, నాణ్యత తదితర కారణాలు చూపుతూ మిల్లర్లు 2 నుంచి 3శాతం వరకు తూకం తగ్గిస్తేనే ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటున్నారు. రైతులు అందుకు అంగీకరించకపోతే ధాన్యాన్ని దించుకునేది లేదని తేల్చిచెబుతుండడంతో అప్పటికే విసిగివేసారిన రైతులు కోతకు అంగీకరించి ధాన్యం దించి, బిల్లులు రాయించుకొని వస్తున్నారు. ఈవిషయమై మిల్లర్లను అధికారులు నిలదీసినా, లేక దించుకోవాల్సిందేనని హెచ్చరించినా తమ గోదాముల్లో ఖాళీలేదని, ధాన్యం దించుకోలేమని చెబుతుండడంతో అధికారులు సైతం గట్టిగా ఆదేశించలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల నల్లగొండ జిల్లాలోని మిల్లుల వద్ద ధాన్యం దించుకోకుండా ఉంటే రైతులు ఆందోళన చేసిన సందర్భంలో ఈవిషయం తేటతెల్లమయింది. జిల్లాలో కేంద్రాల వద్ద కొనుగోలుచేసిన ధాన్యానికి ట్రక్‌షీట్ రాసిన ధాన్యానికి మధ్య దాదాపు 93వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం తేడా ఉండడం కోతల పరిస్థితిని తెలియజేస్తోంది. ధాన్యం విక్రయాలకు ప్రభుత్వం పూర్తిగా మిల్లర్లపై ఆధారపడడంతోనే ఈ దుస్థితి నెలకొందని, ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నప్పటికీ, ఆ ధాన్యాన్ని యథావిధిగా మిల్లులకు తరలించాల్సి రావడంతో మిల్లర్లు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నా, వారిని అదుపు చేయలేని పరిస్థితి నెలకొందని, ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాములకు తరలిస్తే తమకు ఈ దోపిడి భారం తగ్గేదని రైతులు వాపోతున్నారు. సీజన్ ఆరంభంలో మిల్లులపై ఆధారపడకుండా ప్రభుత్వమే ధాన్యాన్ని గోదాముల్లో నిల్వచేస్తారని ప్రకటించినప్పటికీ ఆచరణలో మాత్రం మిల్లులకే ధాన్యం కేటాయించడంతో మిల్లర్లు ఆడిందే ఆటగా సాగుతోంది. జిల్లాలో ఇప్పటివరకు 4,88,494 మెట్రిక్‌టన్నుల ధాన్యం కాంటాలు వేయగా, ఇందులో 3,95,479 మెట్రిక్ టన్నుల ధాన్యం వివరాలనే ట్యాబ్‌లలో ఎంట్రీ చేశారు. ఇందులో 3,48,521 మెట్రిక్‌టన్నుల ధాన్యానికి సంబంధించి మాత్రమే ట్రక్‌షీట్లు జనరేట్ చేశారు. కాంటాలైన ధాన్యంతో పోల్చితే ట్యాబ్‌లో ఎంట్రీ అయిన ధాన్యానికి 93,015 మెట్రిక్ టన్నుల తేడా ఉంటే, ట్రక్‌షీట్ జనరేట్ అయిన ధాన్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే 1,39,973 మెట్రిక్ టన్నుల ధాన్యం తేడా ఉంది. ఈ తేడా ధాన్యానికి సంబంధించిన ట్రక్‌షీట్స్ మిల్లుల వద్ద పెండింగ్ ఉండడమే ఇందుకు కారణంగా స్పష్టమవుతోంది. ధాన్యానికి 2 లేక 3శాతం కటింగ్‌కు రైతులు అంగీకరించిన...

- మిగతా 8వ పేజీలో...

అనధికార డీలర్ల వద్ద విత్తనాలు కొనవద్దు

కలెక్టర్ ఇలాత్రిపాఠి



నల్లగొండలో విత్తన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): రైతులు అనధికార డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ వద్ద తెలంగాణ విత్తన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విత్తన కేంద్రాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగులో రైతులు ఇబ్బందులు పడకుండా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం విత్తన కేంద్రాలను ఏర్పాటు చేసి రాయితీపై రైతులకు విత్తనాలను అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. తక్కువ ధరకు ఆశపడి అనధికారిక డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ నేపథ్యంలో రానున్న వ్యవసాయ సీజన్‌లో సన్నబియ్యం విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తెలంగాణ విత్తన సంస్థ జారీ చేసిన విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని, ప్రత్యేకించి పత్తికి సంబంధించి అనుమతులు లేని లూజు విత్తనాలు కొనుగోలు చేయవద్దని కోరారు. ప్రభుత్వం రాయితీపై పత్తి విత్తనాల పాకెట్లు రూ. 901కి విక్రయిస్తుందని, ఎవరైనా ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పత్తి విత్తనాలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉన్నట్లయితే 8977751452 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని, పాకెట్‌పై తయారు చేసిన తేదీని జాగ్రత్తగా గమనించాలని, రశీదు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, డీసీసీబీ డైరెక్టర్ సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

భవిత వనరుల కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

గుర్రంపోడు: మండలకేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన భవిత వనరుల కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రం ఎదుట ఉన్న శిథిలమైన ఏఎమ్మార్పీ క్వార్టర్లను, చుట్టూ ఉన్న కంపచెట్లను తొలగించాలని సూచించారు. మరుగుదొడ్లను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భవిత కేంద్రానికి అన్ని సౌకర్యాలు కల్పించి సక్రమంగా నడిపించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎమ్మార్సీలో నడుస్తున్న భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ పరికరాలను పరిశీలించి వినియోగాన్ని కేంద్ర నిర్వాహకురాలు ఐఈ ఆర్పీ శారదను అడిగి తెలుసుకున్నారు.

విత్తన పంపిణీకి సమాయత్తం

- ఉమ్మడి జిల్లాలో 104 కేంద్రాల ద్వారా పంపిణీ



7

వనమహోత్సవానికి

మొక్కలు సిద్ధం చేయాలి

- డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి



దామెర నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో పీడీ శేఖర్ రెడ్డి

నాంపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): జూన్ నెలలో నిర్వహించే వనమహోత్సవానికి మొక్కలను సిద్ధం చేయాలని డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. నాంపల్లి మండలంలోని దామెర గ్రామపంచాయతీలో మంగళవారం ఆయన నర్సరీలో ఉన్న మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. కూలీలకు రూ. 307 వేతనం వచ్చే విధంగా పనిచేయించాలని, పని ప్రదేశంలో మంచినీరు, నీడ సౌకర్యం కల్పించాలని అన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కూలీల సంఖ్య పెంచి పనులు కల్పించాలని అన్నారు. ఉపాధి హామీ పథకంలో నీటినిల్వ పనులు, రైతుల వ్యక్తిగత భూములలో పండ్ల తోటల పెంపకం పనులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అనంతరం పెద్దాపురం గ్రామపంచాయతీలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు కాంటా వేస్తున్నారా? లారీల సమస్య హామాలి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. ఇంకా ఎంత ధాన్యం నిల్వ ఉంది, ఎన్ని రోజుల్లో కొనుగోళ్లు పూర్తవుతాయని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో దేవరకొండ ఏపీడీ యామిని, ఎంపీడీవో రామకృష్ణశర్మ, ఏపీవో గుంటుక వెంకటేశం, ఏపీఎం వినోద్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, కోఆర్డినేటరు, పాల్గొన్నారు.

పెట్టుబడిదారుల కొమ్ముకాస్తున్న కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు వెంకట్‌రెడ్డి

నాంపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తుందని, కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తుందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో నిర్వహించిన సీపీఐ మహాసభకు ఆయన పార్టీ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సామాన్య, పేద ప్రజలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దోపిడీ రహిత సమాజం కోసం పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం బాధాకరమన్నారు. ఉగ్రవాదాన్ని అంతమొందించడానికి కుల, మతం, పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త సీపీఐ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించి ప్రజలకు సేవ చేయడానికి ముందు వరుసలో ఉండాలని సూచించారు. ఈ మహాసభలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాగిఫణి అంజాచారి, మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బుడిగపాక జగన్, నాయకులు ఊరు పక్క వెంకటయ్య, నేతల రాజు, పల్లె సైదయ్య, దండిగ వెంకటయ్య, కోరే సత్తయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా పాలీసెట్



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి


నల్లగొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి తెలంగాణ సాంకేతిక విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించిన టీజీ పాలీసెట్ - 2025 ప్రవేశ పరీక్ష మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 25 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. నల్లగొండ జిల్లాలో జరిగిన పరీక్షలను జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. నర్సింహారావు, సూర్యాపేట జిల్లాలో జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సుజాత, యాదాద్రిభువనగిరి జిల్లాలో జరిగిన పరీక్షలను జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. నల్లగొండ జిల్లాలో ఏర్పాటు చేసిన 11 పరీక్ష కేంద్రాలకు 5203 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 4,750మంది హాజరయ్యారు. 480 మంది గైర్హాజరయ్యారు. వీరిలో 2501 మంది బాలికలకు 2278 మంది హాజరుకాగా, 2,702 మంది బాలురకు 2,472 మంది హాజరయ్యారు. సూర్యాపేట జిల్లాలో ఏర్పాటు చేసిన 7 పరీక్ష కేంద్రాలలో 2,798 మంది విద్యార్థులకు 2,590 మంది విద్యార్థులు హాజరు కాగా 208 మంది గైర్హాజరయ్యారు. వీరిలో 1362 మంది బాలికలకు 1260 మంది హాజరు కాగా, 1436 మంది బాలురకు 1330 మంది హాజరయ్యారు. యాదాద్రి జిల్లాలోని యాదగిరిగుట్టలో రెండు, భువనగిరిలో 4 కేంద్రాలలో 1754 మంది విద్యార్థులకు 1664 మంది విద్యార్థులు హాజరుకాగా 90 మంది గైర్హాజరయ్యారు. వీరిలో 844 మంది బాలికలకు 794 మంది హాజరు కాగా 910 బాలురకు 870 మంది హాజరయ్యారు.

ఎస్‌ఐలకు స్థానచలనం

నల్లగొండ టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరు పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న ఐదుగురు ఎస్‌ఐలకు స్థానచలనం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బదిలీ అయిన ఎస్‌ఐల వివరాలు..

ఎస్‌ఐ పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న ప్రదేశం	బదిలీ అయిన స్థానం
అజ్మీరారమేష్	నల్లగొండ ట్రాఫిక్ (దేవరకొండ పీఎస్ అటాచ్)	ఎస్‌హెచ్‌వో, కొండమల్లేపల్లి
ఎం. రామ్మూర్తి	ఎస్‌హెచ్‌వో, కొండమల్లేపల్లి	ఎస్‌హెచ్‌వో, చింతపల్లి
బి. యాదయ్య	ఎస్‌హెచ్‌వో, చింతపల్లి	ఐజీ కార్యాలయ
పి. లోకేష్	సీసీఎస్, నల్లగొండ	ఎస్‌హెచ్‌వో, చందంపేట
యు. సతీష్	ఎస్‌హెచ్‌వో, చందంపేట	ఐజీ కార్యాలయం

సాగర్ నీటి మట్టం 512 అడుగులు



నాగార్జునసాగర్‌లో తగ్గిన నీటి మట్టం

7

వేసవిలోనూ నిండు కుండలా మూసీ

- పెరుగుతున్న నీటి మట్టం



ఎల్ఆర్ఎస్ ఫీజు రాయితీని వినియోగించుకోవాలి

మిర్యాలగూడటౌన్, మే 1(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ ఫీజు రాయితీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తుదారులు తమ ప్లాట్ల క్రమబద్ధీకరణకై చెల్లించే ఎల్ఆర్ఎస్ ఫీజులో 25 శాతం రాయితీనిచ్చే పథకాన్ని ప్రభుత్వం ఈ నెలఖారు వరకు పొడిగించిందని పేర్కొన్నారు.

పాటకు మరణం లేదు

డిండి, మే 13(ఆంధ్రజ్యోతి): గాయకులు గతించినా వారు పాడిన పాటకు మరణం లేదని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు చల్లం పాండురంగారావు అన్నారు. ఇటీవల మృతి చెందిన ప్రజానాట్య మండలి సభ్యుడు నూనె చిరంజీవి సంతాప సభ మంగళవారం తవక్లాపూర్‌లో జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట నూనె వెంకటేశ్వర్లు,మహేష్, ఇరిగి నాగరాజు, హనుమంతు,నవీన్, రజనీకాంత్ ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, డీసీసీ జిల్లా సమన్వయకర్త ఎండీ నాసేర్



దేవరకొండ సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ.నాసేర్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

దేవరకొండ, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, డీసీసీ జిల్లా సమన్వయకర్త ఎండీ నాసేర్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే బాలునాయక్ నివాసంలో ఏర్పాటు చేసిన దేవరకొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమన్వయ కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి నిధులు కేటాయిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ ఎం.ఎ.సిరాజ్‌ఖాన్, డిండి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, బోడ్య నాయక్, నియోజకవర్గంలోని అన్ని మండలాలధ్యక్షులు లోకసాని శ్రీధర్‌రెడ్డి, లోకసాని కృష్ణయ్య, నాగభూషణం, వేమన్‌రెడ్డి, ఎల్లయ్య యాదవ్, నెర్మటి సతీష్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, బద్యనాయక్, హరికృష్ణ, ఎండీ యూనుస్, కొర్ర రాంసింగ్, యుగేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమీకృత మార్కెట్ ఏర్పాటయ్యేదెప్పుడో?

● దేవరకొండలో శంకుస్థాపనకే పరిమితం ● స్థల సేకరణలోనే అధికారులు

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)

దేవరకొండ మునిసిపాలిటీ పరిధిలో సమీకృత మార్కెట్ ఏర్పాటు కలగానే మిగిలిపోతుంది. పట్టణ ప్రజల కోసం గత ప్రభుత్వ హయాంలో 2022లో వెజిటేరియన్, నాన్‌వెజిటేరియన్ మార్కెట్ కోసం రూ.4.50 కోట్లు మంజూరు చేసింది. దీంతో సిల్వర్ జూబ్లీ క్లబ్ సంబంధించి ఐదు ఎకరాల స్థలంలో మార్కెట్ నిర్మించాలని అధికారులు టెండర్ ప్రక్రియను ప్రారంభించారు. శంకుస్థాపన చేశారు. కానీ అట్టి స్థలం కోర్టు పరిధిలో ఉండడంతో మార్కెట్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. 2023లో దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణంలో మార్కెట్‌ను ఏర్పాటుకు అప్పటి కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ కళాశాల ఆవరణంలో మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని విద్యార్థి సంఘాలు ఆందోళన చేయడంతో అట్టి ఆలోచనను విరమించుకున్నారు. అధికారులు ప్రభుత్వ స్థలాలను మార్కెట్ కోసం పరిశీలించడానికే పరిమితం అయ్యారు.

కూరగాయల మార్కెట్ నిధులు ఇతర పనులకు..

అలాగే కూరగాయల మార్కెట్ ఏర్పాటు 7 ఏళ్లుగా శంకుస్థాపనకే పరిమితమైంది. 2018లో పాత కూరగాయల మార్కెట్‌లో రూ. 1.80 కోటితో కూరగాయల మార్కెట్‌కు అప్పటి ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ శంకుస్థాపన చేశారు. నిధులు మంజూరై టెండర్లు పిలిచినప్పటికీ కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో టెండర్ రద్దు చేశారు. మంజూరైన నిధులను సైతం ఇతర పనులకు ఉపయోగించారు.

ఇబ్బందులు పడుతున్న రైతులు

ప్రస్తుతం కూరగాయలు, పండ్లు, పూలు, మటన్, చికెన్ వివిధ రకాల దుకాణాలు వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసి విక్రయిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్ము, ఇతర మండలాల నుంచి రైతులు తాము పండించిన కూరగాయలను దేవరకొండకు తెచ్చి హోల్‌సెల్‌గా రైతులు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. రైతుబజార్, కూరగాయల మార్కెట్ లేకపోవడంతో మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిన రేటుకే కూరగాయలు విక్రయించాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.

రోడ్లపైనే కూరగాయలు, మాంసం విక్రయాలు

మేకల మాంసం సైతం రహదారుల వెంట కోసి మాంసాన్ని విక్రయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొందరు వ్యాపారులు అనారోగ్యంతో ఉన్న మేకలను సైతం విక్రయిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. వెజిటేరియన్, నాన్‌వెజిటేరియన్ మార్కెట్ ఏర్పాటయితే అన్ని రకాల కూరగాయలు ఒకే చోట దొరుకుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందని ప్రజలు తెలుపుతున్నారు. సమీకృత మార్కెట్‌కు స్థలం కేటాయించి మళ్లీ టెండర్లు పిలిచి మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



దేవరకొండలో రోడ్లపైనే కూరగాయలు విక్రయాలు



పాత కూరగాయల మార్కెట్‌లో కూరగాయల మార్కెట్ కోసం కేటాయించిన స్థలం

పాత బజార్‌లో సమీకృత మార్కెట్ ఏర్పాటు చేయాలి



దేవరకొండ గాంధీబజార్ పాత మార్కెట్ ప్రభుత్వ స్థలంలో సమీకృత మార్కెట్ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికి మార్కెట్ ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. మార్కెట్ లేకపోవడంతో వ్యాపారులు అధిక రేట్లకు విక్రయాలు జరుపుతున్నారు. దీంతో రైతులు, ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు.

గాజుల రాజేష్, దేవరకొండ

ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం



దేవరకొండలో సమీకృత మార్కెట్ స్థలం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. గత ప్రభుత్వ హయాంలో మార్కెట్‌కు నిధులు మంజూరు చేసినప్పటికీ ఇతర పనులకు మళ్లించారు. ఉన్న తాధికారుల ఆదేశాలమేరకు మార్కెట్ ఏర్పాటు చేస్తాం.

- సుదర్శన్, మున్సిపల్ కమిషనర్, దేవరకొండ

మొల్కచర్లలో క్షుద్రపూజల కలకలం

అడవిదేవులపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొల్కచర్ల గ్రామంలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని కోట మైసమ్మ గుడి ఎదుట మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ముగ్గులు వేసి దున్నపోతును బలి ఇచ్చి నిప్పు పెట్టి కాల్చారు. ముగ్గుకు ఏడు దిక్కుల్లో ఇనుప మేకులు కొట్టి, పసుపు, కుంకుమ వేసి కుండలు పగులగొట్టారు. క్షుద్ర పూజల ఆనవాళ్లతో గ్రామస్థులు భయాందోళనకు గురై పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకొని విచారణ చేస్తు న్నారు. కాగా సాంకేతికపరంగా అభివృద్ధి చెం దుతున్నా, మూఢనమ్మకాలు, క్షుద్రపూజలు వంటి మూఢనమ్మకాలను ఇంకా నమ్మడమేంటని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గ్రామానికి చెందిన ఆమటి గురవయ్య ఫి ర్యాదు మేరకు క్షుద్ర పూజలు చేసిన నేతునూరి జనార్దన్, బండి శేఖర్, పూజారి సంపత్‌రావుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

పంటల మార్పిడితో అధిక దిగుబడులు

● కంపాసాగర్ వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ లింగయ్య ● నిడమనూరు, హాలియా మండలాల్లో రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం

నిడమనూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): పంటల మార్పిడితో పాటు సాగులో ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని కంపాసాగర్ వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ ఎస్. లింగయ్య, వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీధర్ రైతులకు సూచించారు. మండలంలోని తుమ్మడం గ్రామంలో మంగళవారం రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు పేరిట రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని వారు మాట్లాడారు. రైతులు అధిక దిగుబడుల కోసం ఎక్కువ మోతాదులో యూరియా, రసాయనిక ఎరువులను వినియోగిస్తున్నారని, అవసరం మేరకే వాటిని వినియోగించాలని సూచించారు. దీంతో పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుందని, అదే విధంగా సేంద్రీయ ఎరువులను వాడాలన్నారు. సస్యరక్షణ చర్యలతో తెగుళ్లను నివారించుకోవాలని సూచించారు. వానాకాలం సాగుకు అవసరమైన విత్తనాల లభ్యత, పచ్చిరొట్ట ఎరువుల గురించి సీడ్ అధికారి రాంబాబు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో అనిల్‌నాయక్, గడ్డం గోవిందరెడ్డి, పెదమాము యాదయ్య, బుర్రి వెంకన్న, పాపయ్య, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

హాలియా : పంట పొలాల్లో దిగుబడి కోసం రైతు లు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని పోషకాలతో ఉన్న ఎరువులను ఉపయోగించాలని కృషి వి జ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. కంపాసాగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాలెం గ్రామంలో రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అవసరం మేరకే రసాయనాలను వాడాలని భూమితల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. చెట్లను పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చునన్నారు. కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, ఏవో సరిత, శాస్త్రవేత్తలు చంద్రశేఖర్, రాములమ్మ, ఉద్యాన శాఖ అధికారి మురళి, అభ్యుదయ రైతులు కాట్నం రామయ్య, కాట్నం సైదయ్య, పాల్గొన్నారు.



హాలియా : సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

దొంగతనాల నియంత్రణకు నిఘా

● జనార్దన్‌గౌడ్, సీఐ, హాలియా



సర్కిల్ పరిధిలోని దొంగతనాల నియంత్రణకు గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు హాలియా సీఐ జనార్దన్ గౌడ్ తెలిపారు. ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు పోలీసులతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో తెలిపారు.

(ఆంధ్రజ్యోతి-హాలియా)

ఇంటర్వ్యూ Interview

ఆంధ్రజ్యోతి : రైతుల మోటార్లు ట్రాక్టర్ల దొంగతనాల పరిస్థితి ఏంటి?

సీఐ : సర్కిల్ పరిధిలో అక్కడక్కడ రైతుల మోటార్లు, వైర్లు దొంగిలిస్తున్నట్లు, ట్రాక్టర్ల దొంగతనాలు జరిగినట్లు ఫిర్యాదులు వచ్చాయి. త్రిపురారం స్టేషన్ పరిధిలో ఇటీవల మూడు ట్రాక్టర్లు, 4 ట్రాలీలను, పనిముట్లను రికవరీ చేశాం. మోటార్ దొంగతనాల మీద కూడా వర్క్ అవుట్ చేస్తున్నాం. బాధితులకు కూడా న్యాయం చేస్తాం..

ఆంధ్రజ్యోతి : సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారా

సీఐ : హాలియా, ఇబ్రహీంపేట, త్రిపురారం, నిడమనూరు ప్రాంతాల్లో దాతల సమకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం.

ఆంధ్రజ్యోతి : అక్రమ వ్యాపారాలపై దృష్టి పెడుతున్నారా

సీఐ : అక్రమవ్యాపారాలపైనిఘా పెట్టాం. సమాచారం అందిన వెంటనే కేసులు నమోదు చేస్తున్నాం .

ఆంధ్రజ్యోతి : వేసవిలో దొంగతనాలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నారా

సీఐ : వేసవిలో దొంగతనాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు కళాజాత ద్వారా ప్రజలను చైతన్యపరుస్తున్నాం. అదే విధంగా గ్రామాల్లో వీపీవో సిస్టం ద్వారా ఎప్పటికప్పుడు కొత్త వ్యక్తుల సమాచారాన్ని కూడా పోలీస్ వారు తెలుసుకుంటూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు?

సీఐ : ట్రాఫిక్ నియంత్రణపై హాలియాలో ఎప్పటికప్పుడు పెట్రోలింగ్ చేస్తూ వాహనదారులకు సూచనలు చేస్తున్నాం. నిర్లక్ష్యంగా వ్యవహరించి వారిపై జరిమానా కూడా వేస్తున్నాం. ఇతరులకు ఇబ్బందులు కలగకుండా తమ వాహనాలను పార్కింగ్ చేయాలని సూచిస్తున్నాం. అలాగే తోపుడు బండ్లు, చిరు వ్యాపారస్తులతో కొంత ట్రాఫిక్ ఇబ్బంది కలిగిస్తున్నారు. దీంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. అలాంటి వారు కూడా తీరుమార్చుకోకపోతే జరిమానా వేస్తాం.

తండా పంచాయతీలకు నిధులు కేటాయించాలి

● ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ● గిరిజన సంఘం రాష్ట్ర శిక్షణ తరగతుల కరపత్రం ఆవిష్కరణ



టీఆర్‌జీఎస్ సభ్యులతో కలిసి కరపత్రం విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

మిర్యాలగూడ, మే 13(ఆంధ్రజ్యోతి): తండా గ్రామపంచాయతీలకు రెవెన్యూ పంచాయతీ హోదా కల్పించాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఎమ్మెల్సీ నివాసంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం రాష్ట్ర శిక్షణ తరగతుల కరపత్రాన్ని ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ తండా పంచాయతీలకు తగినన్ని నిధు లు కేటాయించడంతో పాటు రెవెన్యూ పంచా యతీ హోదా కల్పించేలా చూడాలని అన్నారు. విద్యాహక్కు చట్టప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేద, దళిత, గిరిజన పిల్లలకు 25 శాతం సీట్లను ఉచితంగా అమలు చేసేటట్లు ప్రభు త్వం చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనులకు రిజర్వేషన్లు ఉన్నప్పటికీ విద్యా, ఉద్యోగ వ్యాపార రంగాల్లో ఇప్పటికీ గిరిజనులు వెనుకబడి ఉన్నారన్నారు. సబ్ ప్లాన్ నిధులు వారికే కేటా యించి అభివృద్ధి వైపు పయనించేలా కృషి చేయాలన్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో హా లియా పట్టణంలో రిటైర్డ్ ఉద్యోగుల భవన్‌లో నిర్వహించే టీఆర్‌జీఎస్ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో టీఆర్‌జీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర శంకర్ నాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రమా వత్ నరేశ్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు నేనావత్ అశోక్‌నాయక్, నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రమావత్ రమేష్ నాయక్, ప్రదీప్, మనసీ నాయక్, దేవేందర్ నాయక్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం





మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, పూజ కార్యక్రమాలకు హాజరైన మహిళలు

హాలియా,మే 13(ఆంధ్రజ్యోతి): హాలియా పట్టణంలోని స్వయంభూ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం భగవారాధన, తీర్థప్రసాద గోష్టి, మహాపూర్ణాహుతి అనంతరం చక్రస్నానం, మహాకుంభప్రోక్షణ, తీర్థప్రసాద వితరణ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలి

చింతపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): వేసవి నేపథ్యంలో ప్రజలకు వడదెబ్బ సోకకుండా వైద్య సిబ్బంది అవగాహన సదస్సులు ఏర్పా టు చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు సముద్రాల నగేష్ అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం ఆయన విలేకరు లతో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వడదెబ్బ సోక కుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందు బాటులో ఉంచుకోని వ్యా ధుల నివారణకు సిబ్బంది కృషి చేయాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేములపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి. వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. మండలంలోని రావులపెంట గ్రామానికి చెందిన తంగెళ్ల రవీందర్‌రెడ్డి అదే గ్రామ శివారులోని పాలేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి ట్రా క్టర్ యజమాని రవీందర్‌రెడ్డి, అతడి డ్రైవర్ గుంజ నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

● సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్

మిర్యాలగూడ, మే 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ అన్నారు. ఈ నెల 20న నిర్వహించతలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్‌ను మంగళవారం వేర్‌హౌస్ కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక ఏళ్లు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను కొత్త చట్టం అమలులోకి తెచ్చిందన్నారు. కార్మికసంఘాలు పెట్టుకునే పరిస్థితి లేకుండా చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రాంమూర్తి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లుగౌతంరెడ్డి, జిల్లా నాయకులు బీఎం నాయుడు, నాయకులు అంజల్‌రావు, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, రామ్‌నాయక్, సైదులు, అంజయ్య, కృష్ణ పాల్గొన్నారు.



సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డబ్బీకార్ మల్లేష్, తదితరులు

పబ్లిక్ డిమాండ్
PUBLIC DEMAND

అలంకార ప్రాయంగా హైమాస్ట్ లైట్లు

చింతపల్లి మండలం గొడకొండ్ల, మదనాపురం, ఎం.మల్లేపల్లి, తక్కళ్లపల్లి, తదితర గ్రామాల్లో రూ. లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన హైమాస్టు లైట్లు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి.. వీటి నిర్వాహణ పంచాయతీ అధికారులకు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా పోవడంతో మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వాహనదారులతో పాటు పాదచారులు నిత్యం రాత్రివేళ్లలో బయటకు రావాలంటే ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి హైమాస్ట్ లైట్లకు మరమ్మతు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి- చింతపల్లి)



మదనాపురంలో అలంకార ప్రాయంగా మారిన హైమాస్ట్ లైట్

ట్రక్ చీట్

(5వ పేజీ తరువాయి)

తర్వాతనే ఫైనల్‌గా ఆమేరకు తూకం తగ్గించి ట్రక్‌షీట్ ఖరారు చేస్తున్నారని, దాని ఆధారంగానే ట్యాబ్‌లలో ఎంట్రీ చేయాల్సి ఉండడం వల్లే ట్యాబ్‌లలలో ఎంట్రీ అయ్యే ధాన్యానికి, కేంద్రాల వద్ద కాంటాలు వేసిన ధాన్యానికి మధ్య తేడా వస్తోంది. రైతులకు నష్టం కలిగిస్తోన్న ఈ వ్యవహారాన్ని అడుగడుగునా పరిశీలించి, రైతులను కాపాడాల్సిన అధికారులు మిన్నకుండిపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని రైతాంగం వాపోతోంది.

సన్నధాన్యమంతా మిల్లులకే

జిల్లాలో ఈ సీజన్‌లో 12.14 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉత్పత్తవుతుందని అంచనా వేయగా, అందులో 6.50లక్షల మెట్రిక్ టన్నుల వరకు సన్నధాన్యముంటుందని అంచనా వేశారు. ఇందులో సగమైనా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనాలని నిర్ణయించి, ఇందుకోసం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే క్వింటాకు రూ.500 బోనస్ కూడా ఇస్తామని ప్రకటించారు. అయితే జిల్లాలో బోనస్‌ని రైతాంగం పట్టించుకోలేదు. సన్నధాన్యం వచ్చింది వచ్చినట్లుగా మిల్లులకే నేరుగా విక్రయించారు. జిల్లావ్యాప్తంగా సన్నధాన్యం కోసం 39 కేంద్రాలు ప్రత్యేకంగా ప్రారంభించినా ధాన్యం రాకపోవడంతో 29 కేంద్రాలే కొనసాగించారు. ఇప్పటి వరకు జిల్లాలో రూ.35.44 కోట్ల విలువైన 15,278 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. మరో 1,500 మెట్రిక్ టన్నుల వరకు సన్నధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో పండిన దాదాపు 6.50లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం మొత్తానికి మొత్తంగా మిల్లుల వద్దనే రైతులు అమ్ముకోవడం గమనార్హం. మిల్లుల వద్ద ధాన్యానికి మద్దతు ధర కంటే ధర తక్కువే ఇచ్చినా, తూకం వెంటనే వేయడంతోపాటు, పచ్చిధాన్యం సైతం కొనుగోలు చేశారని, మిల్లులోని అధునిక టెక్నాలజీ మిల్లర్లకు ఇందుకు ఉపయోగపడిందని చెబుతున్నారు. సన్నధాన్యాన్ని ఆరబెడితే క్వింటాకు దాదాపు 10 కిలోల వరకు తూకం తేడా వస్తోందని, అదే మిల్లుల వద్ద నేరుగా ఇస్తే ఆమేర కలిసొస్తుందని, ప్రభుత్వమిచ్చే బోనస్‌తో ఇంతకు మించి వచ్చేదేమీ లేదని, అందువల్లే నేరుగా మిల్లర్లకు అమ్మేస్తున్నామని రైతులు చెబుతుండడం గమనార్హం.

వేగంగా కొనుగోళ్లు పూర్తిచేయాలనే..

జిల్లాలో 375 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 4,88,494 మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. కేంద్రాల వద్ద ఇంకో 28,103 మెట్రిక్‌టన్నుల ధాన్యం కాంటాలు వేయాల్సి ఉందని చెబుతున్నారు. మరో 35వేల మెట్రిక్‌టన్నుల వరకు ధాన్యం కేంద్రాలకు వస్తుందని అంచనావేసిన అధికార యంత్రాంగం ఈవారంలో ధాన్యం కొనుగోళ్ల పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకొంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 67,866 మంది రైతులకు సం బంధించి రూ.1133.31 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా, ఇందులో 52,369 మంది రైతులకు సంబంధించి రూ.810.10 కోట్ల డబ్బు రైతుల ఖాతాల్లో జమచేశామని చెబుతున్నారు. ఇంకో రూ.2.65 కోట్ల డబ్బులు ఒకటి, రెండు రోజుల్లో జమవుతుందని పేర్కొన్నారు. ట్యాబ్‌లలో నమోదయ్యాక రెండు, మూడు రోజుల్లో నగదు రైతుల ఖాతాల్లో వేస్తున్నామని, గరిష్ఠంగా అయిదు రోజుల్లో డబ్బు రైతులకు చేరుతుందని పేర్కొంటున్నారు.

కొనుగోళ్లు వేగంగా జరుపుతున్నాం

మిల్లుల వద్ద దిగుమతి జాప్యమవుతుండడంతోనే ట్యాబ్ ఎంట్రీలలో జాప్యం జరుగుతోంది. మిల్లుల వద్ద ధాన్యం తూకంలో కోత విధిస్తున్నారనే అంశం మాదృష్టికి రాలేదు. దిగుమతుల అలస్యంతోనే కొనుగోలు కేంద్రాల్లో తూకానికి, ట్రక్‌షీట్లలో తూకానికి మధ్య తేడా కనిపిస్తుంది. మిల్లుల వద్ద కాంటాలు పూర్తయ్యాక పూర్తివివరాలతో ట్యాబ్‌లలో, ట్రక్‌షీట్లలో ఎంట్రీ చేస్తారు. ఈ వారంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ దాదాపు ముగించే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

-హరీష్, డీఎం, సివిల్‌సప్లయిస్ కార్పొరేషన్, నల్లగొండ